

నోటీసులు అందజేస్తున్న డీఎస్పీతో చంద్రబాబు వాగ్వాదం

2023 జనవరి 5

కుప్పంలో బాబుకు ఆంక్షలు

చంద్రబాబును అడ్డుకోవడానికి వైసీపీ జీవో నెంబర్ 1 ను తీసుకొచ్చింది. ఇది చీకటి జీవో అని ప్రతిపక్షాలు పెద్దఎత్తున నిరసనలు వ్యక్తం చేశాయి.అయినా అప్పటికి మూడుసార్లు సీఎంగా, 8సార్లు కుప్పం ఎమ్మెల్యేగా పనిచేసిన వ్యక్తిని తన నియోజకవర్గంలోకి అడుగు పెట్టకూడదని పోలీసులు అడ్డుకున్నారు.రోజంతా హైడ్రామా నడిచింది. చివరికి చంద్రబాబు నేల మీద కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. బాగా పొద్దుపోయాక వదిలారు.ఆ తర్వాతా రెండు రోజులు ఆయన ఎక్కడా పర్యటించకుండా, మైకు ఇవ్వకుండా, ప్రచార రథం లేకుండా చేశారు. అప్పుడూ ఎస్పీ సీన్‌లో లేరు. కింది స్థాయి అధికారులే ముందు నిలిచారు.

అప్పుడలా.. ఇప్పుడిలా...

జగన్ జమానాలో దబాయింపు

బాబు పాలనలో మెతకదనం

మాజీ సీఎంల పట్ల జిల్లాలో పోలీసుల తీరుపై చర్చ

చిత్తూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ బుధవారం జరిపిన బంగారుపాళ్యం మార్కెట్ యార్డు సందర్శన యాత్ర తర్వాత జిల్లా పోలీసుల తీరుపై ప్రజల్లో చర్చ జరుగుతోంది. మాజీ సీఎం పట్ల వైసీపీ పాలనలో జిల్లా పోలీసులు వ్యవహరించిన తీరునూ, చంద్రబాబు పాలనలో అనుసరిస్తున్న తీరునూ పోల్చుకుని మాట్లాడుకుంటున్నారు. రాజకీయ వర్గాల్లో అయితే ఈ చర్చ మరీ తీవ్రంగా ఉంది. జగన్ పాలనలో పోలీసులు ఉన్నంత చురుగ్గా, దూకుడుగా, దబాయింపుగా ఇప్పుడు లేరనే మాటలు వినిపిస్తున్నాయి. చిన్నా చితకా ప్రతిపక్ష నాయకులను కూడా అప్పట్లో గడప దాటనివ్వకుండా కట్టడి చేసిన పోలీసులు, ఇప్పుడు ఆంక్షలు ఉల్లంఘించినా చేతులెత్తేయడం ఏమిటనే ప్రశ్న వినిపిస్తోంది.

2023 ఆగస్టు 4

పుంగనూరులో దౌర్జన్యం



పుంగనూరు పట్టణంలోకి రానీయకుండా టీడీపీ శ్రేణులపై పోలీసుల లాఠీచార్జ్

చంద్రబాబును పుంగనూరులోకి రానివ్వకూడదని వైసీపీ శ్రేణులు పట్టణంలో పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేసి టీడీపీ నాయకుల్ని రెచ్చగొట్టారు. అనుగుణంగా పోలీసులు పుంగనూరు బైపాస్‌లో బారికేడ్లను ఏర్పాటు చేసి భారీ బందోబస్తు నిర్వహించారు. అక్కడ టీడీపీ శ్రేణులు తిరగబడగా.. పరస్పరం రాళ్లు రువ్వుకున్నారు. ఎంత చేసినా చంద్రబాబును పుంగనూరులో అడుగు పెట్టనివ్వలేదు. ఆయన పాత రూట్ మ్యాప్ మేరకు పుంగనూరు బైపాస్ మీదుగా పూతలపట్టు చేరుకునేలా చేశారు. ఇక్కడ సీన్‌లో ఎస్పీ స్థాయి అధికారి లేకుండా కిందిస్థాయి అధికారులతోనే అంతా నడిపించారు.ఆ తర్వాత టీడీపీ నాయకులను, కార్యకర్తలను దారుణంగా వేధించారు. వందలాదిమందిపై కేసులు పెట్టారు.

2025 జూలై 9

జగన్ హంగామా



రూట్ మార్చొద్దన్న ఎస్పీతో జగన్ వాగ్వాదం

జగన్ పర్యటన రూట్ మ్యాప్‌ను పోలీసులు వారం ముందే వైసీపీ నాయకులకు అందించారు. ముందు రోజు కూడా ఆ రూట్‌లోనే రిహార్సల్స్ కూడా చేశారు. కానీ, జగన్ పోలీసుల రూట్ మేరకు నడుచుకోలేదు. వాస్తవానికి జగన్ హెలిప్యాడ్ నుంచి వంద మీటర్లు ప్రయాణించి హైవే ఎక్కాలి. తిమ్మోజిపల్లె క్రాస్‌కు వెళ్లి అక్కడి నుంచి బంగారుపాళ్యం యార్డుకు వెళ్లాలి.కానీ, జగన్ బంగారుపాళ్యం లోపలి నుంచి వెళ్లడానికి ప్రయత్నించారు. ఆయనను ఆ దారిలో వెళ్లనివ్వకుండా ఆపడానికి ఏకంగా ఎస్పీ స్థాయి అధికారి నానా అవస్థ పడాల్సి వచ్చింది. అయినా జగన్ హెలిప్యాడ్ నుంచే సర్వీసు రోడ్డులోనే ప్రయాణించి హైవే దాటి యార్డుకు చేరుకున్నారు. దీంతో వైసీపీ వాళ్లు ముందుగా ప్లాన్ చేసుకున్న విధంగా మామిడి కాయల్ని ఆ రూట్‌లో కింద పోయగలిగారు. ఇలా చేస్తారని ముందు రోజే తెలిసినా పోలీసులు నిలువరించలేకపోయారు.15 చెక్‌పోస్టుల్ని ఏర్పాటుచేసినా జనాల్ని రాకుండా కట్టడి చేయలేకపోయారు.



జగన్ కాన్వాయ్ ఎదురుగా మామిడి కాయలు పోసిన వైసీపీ నాయకులు

తానా కార్యదర్శిగా సునీల్



చిత్తూరు రూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): అమెరికాలో అతిపెద్ద తెలుగు సంఘమైన ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) కార్యదర్శిగా చిత్తూరుకు చెందిన సునీల్ పాంత్ర ఎంపికయ్యారు.చాలా ఏళ్లుగా తానాలో పదవులు నిర్వర్తించిన సునీల్ ఈ నెల 8వ తేదిన డెట్రాయిట్‌లో జరిగిన 24వ తానా మహాసభలను విజయవంతంగా నిర్వహించడంలో కీలకపాత్ర పోషించడంతో ఈ పదవికి ఎంపిక చేశారని సునీల్ తెలిపారు. తనకు ఇంత పెద్ద బాధ్యతలు అప్పగించిన తానా పెద్దలకు సునీల్ కృతజ్ఞతలు తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

బంగారుపాళ్యం, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై దాడి కేసులో ఇద్దరిని అదుపులోకి తీసుకున్న బంగారుపాళ్యం సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేశారు. చిత్తూరుకు చెందిన చక్రి, జీడీ నెల్లూరు మండలం ముక్కల్తూరుకు చెందిన వినోద్‌లపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. బైరెడ్డిపల్లెకు చెందిన ప్రకాష్ ఆచారిపై కేసు నమోదు చేశామని, అతడు పరారీలో ఉన్నాడని తెలిపారు. ఈ కేసుతో సంబంధమున్న మరికొందరిపై కేసు నమోదు చేయనున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డుపై కాయలు పోసిన ఐదుగురిపై కేసు

● రెండు ట్రాక్టర్ల సీజ్

బంగారుపాళ్యం, జూలై 10(ఆంధ్రజ్యోతి): జగన్ పర్యటన సందర్భంగా బంగారుపాళ్యం మండలం తిమ్మోజుపల్లె సమీపంలో రోడ్డుపై మామిడికాయలను పోసిన ఐదు గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. తుంబపాళ్యానికి చెందిన దేవేంద్ర, డ్రైవర్లు అక్బర్, ఉదయ్‌కుమార్‌లను అదుపులోకి తీసుకుని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రెండు ట్రాక్టర్లను సీజ్ చేశామన్నారు. తిమ్మోజుపల్లెకు చెందిన ప్రకాష్, భరత్‌రెడ్డిలపై కూడా కేసు నమోదు చేశామని,వారిద్దరూ పరారీలో ఉన్నారని తెలిపారు. అలాగే జగన్ పర్యటన సందర్భంగా నిబంధనలను ఉల్లంఘించి రోడ్డు షో నిర్వహించిన ఐదుగురిపై కేసు నమోదు చేశామన్నారు.మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్,బంగారుపాళ్యం మండల వైసీపీ కన్వీనర్ పాలేరు రామచంద్రారెడ్డి, జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ కుమార్‌రాజా, కిశోర్‌కుమార్‌రెడ్డి, గజేంద్రలపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నిరసన గళం

● ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడికి పాల్పడిన వైసీపీ మూకలను అరెస్టు చేయాలంటూ ధర్నాలు

● జిల్లావ్యాప్తంగా జర్నలిస్టుల ఆందోళనలు



చిత్తూరు గాంధీ విగ్రహం ఎదుట నల్లబ్యాడ్జీలతో జర్నలిస్టుల నిరసన

చిత్తూరు అర్బన్, జూలై 10(ఆంధ్రజ్యోతి):వైసీపీ అధ్యక్షుడు జగన్ బంగారుపాళ్యం పర్యటనలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై దాడి చేసిన ఆ పార్టీ అల్లరి మూకలను అరెస్టు చేయాలటూ జిల్లావ్యాప్తంగా జర్నలిస్టు సంఘాలు నినదించాయి. కొన్ని చోట్ల నిరసన ప్రదర్శనలు నిర్వహించగా...మరికొన్ని చోట్ల నల్ల బ్యాడ్జీలు ధరించి వైసీపీకి వ్యతిరేకంగా ధర్నాలు చేశారు.దాడి కేసులో నిందితులను అరెస్టు చేయాలంటూ అధికారులకు వినతిపత్రాలను సమర్పించారు. చిత్తూరులో గాంధీ విగ్రహం వద్ద ఏపీయూడబ్ల్యూజే, చిత్తూరు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు నల్ల బ్యాడ్జీలు ధరించి వైసీపీకి వ్యతిరేకండా నినాదాలు చేశారు.పత్రికా స్వేచ్ఛ అంటే అర్థం తెలియకుండా ఫొటోగ్రాఫర్‌పై దాడి చేసిన వైసీపీ శ్రేణులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల రక్షణ కోసం దాడుల నివారణ కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు.అనంతరం ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఏవో మురళీ మోహన్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు లోకనాథన్, కార్యదర్శి మురళీకృష్ణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అశోక్‌కుమార్,జయప్రకాష్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రమేష్, సెక్రటరీ కాళేశ్వరరెడ్డి, సంయుక్త కార్యదర్శి నవీన్ తదితరులు పాల్గొన్నారు.పలమనేరు ఆర్డీవో కార్యాలయం వద్ద వివిధ జర్నలిస్టు సంఘాలు నిరసన వ్యక్తం చేశాయి.ఫొటోగ్రాఫర్‌పై దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశాయి. అనంతరం ఆర్డీవో భవానీకి వినతిపత్రాన్ని అందజేశాయి.కుప్పంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేసిన జర్నలిస్టు సంఘ నేతలు ప్రదర్శనగా కడా ఆఫీస్ మీదుగా డీఎస్పీ కార్యాలయానికి చేరుకుని డీఎస్పీ పార్థసారధికి వినతిపత్రాన్ని అందజేశారు. పూతలపట్టు అంబేడ్కర్ సర్కిల్ వద్ద ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు నిరసన ప్రదర్శన నిర్వహించారు.ఏపీయూడబ్ల్యూజే జీడీ నెల్లూరు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద జర్నలిస్టులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. పుంగనూరులో ఏపీయూడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు ఎన్టీయార్ సర్కిల్ వద్ద ధర్నా చేశారు.తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ రాముకు వినతిపత్రాన్ని అందజేశారు.

పిల్లల విషయంలో తల్లిదండ్రుల భాగస్వామ్యం అవసరం

● మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు సెంట్రల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): పిల్లల విషయంలో టీచర్లతో పాటు తల్లిదండ్రుల భాగస్వామ్యం ఎంతో అవసరమని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ అభిప్రాయపడ్డారు.జిల్లావ్యాప్తంగా గురువారం 2838 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ డేని ఘనంగా నిర్వహించారు. రొంపిచెర్లలోని మోడల్ స్కూల్లో నిర్వహించిన సమావేశానికి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులతో పాటు రుచికరమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను మొబైళ్లకు దూరంగా ఉంచాలన్నారు. మూడు నెలలకు ఒకసారి నిర్వహించే పీటీఎంకు తప్పక హాజరవ్వాలన్నారు.కాగా జిల్లావ్యాప్తంగా మెగా పేరెంట్స్ టీచర్స్ డే వేడుకల్లో 3,23,365 మంది పాల్గొన్నారు. ఇందులో 2,07,621మంది విద్యార్థులు కాగా, 62,345 మంది తల్లిదండ్రులు, 7962 మంది టీచర్లు,1403 మంది ప్రజాప్రతినిధులు ,11,561మంది స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు,1438మంది పూర్వ విద్యార్థులు ,1316మంది దాతలు ,1455మంది అధికారులు, 2047మంది స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల దాకా ప్రతి పాఠశాలలో పీటీఎం కార్యక్రమాలు షెడ్యూల్ ప్రకారం నిర్వహించి, వాటి వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు.బంగారుపాళ్యం హైస్కూల్లో నిర్వహించిన మెగా పీటీఎంలో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే మురళీమోహన్, ఎస్‌ఆర్‌పురం మండలం మద్దికుప్పం స్కూల్లో డీఈవో వరలక్ష్మి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.రామకుప్పం మండలం వీర్నమల హైస్కూల్లో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, చిత్తూరు సంతపేటలోని పీఎన్‌సీ హైస్కూల్లో ఎమ్మెల్యే జగన్మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మేయర్ అముద, ఎస్‌ఆర్‌పురం మండలం కొత్తపల్లిమిట్ట జడ్పీ హైస్కూల్లో ఎమ్మెల్యే వీఎం థామస్, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.



రొంపిచెర్ల మోడల్ స్కూల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్





చిత్తూరు సంతపేట స్కూల్లో తల్లులకు పిల్లల పాదాభివందనం - కుప్పం మండలం గోనుగూరు జడ్పీ హైస్కూల్లో తల్లికి విద్యార్థిని పాదపూజ



తిరుమలలో శివమణి

తిరుమల శ్రీవారిని గురువారం ప్రసిద్ధ డ్రమ్స్ వాయిద్య కళాకారుడు శివమణి దర్శించుకున్నారు. ఇంకా సీనియర్ ఐపీఎస్ అధికారి ఐజీ శ్రీకాంత్ కూడా స్వామి దర్శనం చేసుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

వరకట్న వేధింపులకు వివాహిత బలి



సుజాత
(ఫైల్ ఫొటో)

సూళ్లూరుపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపులు తాళలేక గంధవల్లి సుజాత(32) అనే వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. పోలీసుల సమాచారం మేరకు.. సూళ్లూరుపేట మండలం నాదెండ్లవారికండ్రిగకు చెందిన గంధవల్లి సుజాతకు తమిళనాడుకు చెందిన వ్యక్తితో వివాహమైంది. ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో విడాకులు తీసుకుని నాదెండ్లవారికండ్రిగలోని అమ్మగారి ఇంట్లో ఉంటోంది. ఈ ఏడాది జనవరి 31న నాయుడుపేటకు చెందిన తన మేనత్త కుమారుడు రాజేంద్రను కుటుంబ సభ్యుల అంగీకారంతో వివాహం చేసుకుంది. ఇటీవల భర్తతో పాటు అత్త, ఆడబిడ్డ వరకట్నం తేవాలంటూ సుజాతను వేధించారు. దీంతో మనస్తాపానికి గురైన సుజాత నెలకిత్రం అమ్మగారి ఇంటికి చేరుకుంది. గురువారం తన తమ్ముడికి ఫోన్ చేసి మీరు కట్నం ఇవ్వరు.. నా జీవితం ఎందుకు ఇంక.. నేను చనిపోతున్నా అని చెప్పింది. కంగారుపడిన అతడు తన తండ్రి రవికి ఫోన్‌లో సమాచారం ఇచ్చి ఇంటికి చేరుకునే లోపే సుజాత ఉరి వేసుకుని మృతి చెందింది. భర్త రాజేంద్ర, అత్త, ఆడబిడ్డలే తన చావుకు కారణమంటూ సుజాత రాసిన లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు సూళ్లూరుపేటకు చేరుకుని మృతురాలు కుటుంబ సభ్యులతో పాటు, భర్త రాజేంద్ర, అత్త, ఆడబిడ్డలను విచారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సర్వదర్శనానికి 14 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.4.39 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 76,501

తలనీలాలు సమర్పించినవారు: 29,033



పులికాట్‌లో అప్పుడే పక్షుల కిలకిలలు









కాలం కాని కాలంలోనూ పులికాట్ సరస్సులో ఈ ఏడాది వలస పక్షుల సందడి కనిపిస్తోంది. సాధారణంగా వేసవిలో పులికాట్ ఎడిపోయి నెర్రెలుబారి ఉంటుంది. అయితే ఈ ఏడాది జనవరి దాకా కూడా వానలు కొనసాగడం, వేసవి ముగియకముందే అడపాదడపా వానలు పడడంతో సరస్సులో అక్కడక్కడా నీటి నిల్వలు చేరాయి. సముద్రపు ఆటుపోట్లకు కూడా సరస్సులోకి నీరు వచ్చి చేరుతోంది. దీంతో చేపా రొయ్యా కదలాడుతున్నాయి. తిండి దొరుకుతుండడంతో స్థానిక రకాల కొంగలతో పాటూ వలస పక్షులు కూడా సరస్సులో కనిపిస్తున్నాయి. ఫ్లెమింగోలు, పెయిటెడ్ స్టార్క్స్, పెలికాన్, నత్తగుల్ల కొంగలు, తెల్లకొంగలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. ఆ కాస్త నీటి చెలమల్లోనే వేటను వెతుక్కుంటున్నాయి. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోటకు వెళ్లే మార్గంలో అటూ ఇటూ.. అట్టకానితిప్ప వేనాడు దారి, కొరిడి-పేర్నాడు రోడ్డు, శ్రీహరికోట మొదటి గేటు సమీపంలో బకింగ్ కెనాల్ వద్ద పక్షులు సందడి చేస్తున్నాయి. మత్స్య సంపద దొరుకుతుండడంతో మరోవైపు జాలర్లు కూడా వలలు విసురుతున్నారు. పడవలు తిరుగుతున్నాయి. సాధారణంగా ఈ ప్రాంతానికి నైరుతి వానలు కురవవు. ఈశాన్య రుతుపవనాలతో జల్లులు మొదలై తుపాన్‌లతో కురిసే వానలతో నదులు పొంగి పారుతాయి. చెరువులు నిండుతాయి. పులికాట్ కళకళలాడుతుంది. విచిత్రంగా ఈ వాతావరణం అప్పుడే పులికాట్‌లో కనిపించడం అరుదైన కనువిందు దృశ్యం.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి,
ఫొటోలు: స్టాఫ్ ఫొటోగ్రాఫర్

దక్షిణామూర్తికి వెండి హారతి సెట్



వెండి హారతి సెట్‌ను అందజేస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ బొప్పన ఝాన్సీ తదితరులు

శ్రీకాళహస్తి, జూలై 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మేధో గురుదక్షిణామూర్తికి గురుపౌర్ణమిని పురస్కరించుకుని శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ బొప్పన ఝాన్సీ, డైరెక్టర్ సీమ రూ.4.10లక్షల విలువైన వెండి హారతి సెట్‌ను వితరణ చేశారు. వాటిని ఆలయ ఈవో బాపిరెడ్డి స్వీకరించి దాతలకు స్వామిఅమ్మవార్ల దర్శనం ఏర్పాట్లు చేశారు. వారు గురుదక్షిణామూర్తి వద్ద జరుగుతున్న పూజల్లో పాల్గొన్నారు.

మాన్యుఫ్యాక్చరింగ్ వరల్డ్‌లో శ్రీసిటీ ప్రాతినిధ్యం



సందర్శకులకు శ్రీసిటీ గురించి వివరిస్తున్న ప్రతినిధులు

శ్రీసిటీ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తయారీ రంగానికి ప్రాధాన్యం కలిగిన ప్రపంచ గమ్య స్థానంగా శ్రీసిటీ గురించి వివరణ్మాతకంగా తయారు చేసిన మార్కెటింగ్ వీడియోలను శ్రీసిటీ మార్కెటింగ్ బృందం టోక్యోలో జరిగిన కార్యక్రమంలో ప్రదర్శించింది. జపాన్‌లోని టోక్యో నగరంలో జరిగిన 'మాన్యుఫ్యాక్చరింగ్ వరల్డ్ 2025' వాణిజ్య ప్రదర్శనలో శ్రీసిటీ పాల్గొని ప్రత్యేకతను చాటుకుంది. ఆర్ఎక్స్ జపాన్ లిమిటెడ్ నిర్వహించిన 37వ ఎడిషన్ ఎగ్జిబిషన్‌లో ఐటీ సొల్యూషన్స్, మెకానికల్ కాంపోనెంట్స్, మెడికల్ డివైసెస్, సైబర్ సెక్యూరిటీ, స్మార్ట్ మెయింటెన్స్ తదితర పది విభాగాలకు సంబంధించి ప్రదర్శన ఏర్పాటు చేశారు. భారతదేశంలో రెండవ అతి పెద్ద జపనీస్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌గా వివరిస్తూ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శ్రీసిటీ స్టాల్ అందరి దృష్టిని ఆకర్షించింది. శ్రీసిటీ వ్యూహాత్మక స్థానం, ప్రపంచస్థాయి మౌలిక వసతులు, రవాణా అనుసంధానం, పరిశ్రమలు స్థాపించడం కలిగే వివిధ ప్రయోజనాలను శ్రీసిటీ మార్కెటింగ్ ప్రతినిధులు గోపికృష్ణ, కె.బాలాజీ, శ్రీసిటీ సలహాదారు మసనోరి నకానో సందర్శకులకు వివరించారు.

నైపుణ్య శిక్షణతో జీవనోపాధి కల్పన

- కాలేజియేట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ భరత్‌కుమార్‌గుప్తా



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 10 (ఆంధ్రజ్యోతి): మహిళలకు నైపుణ్య శిక్షణ అందించడం ద్వారా జీవనోపాధి కల్పించే లక్ష్యం ఉందని రాష్ట్ర కాలేజియేట్ ఎడ్యుకేషన్ శాఖ డైరెక్టర్ భరత్‌కుమార్‌గుప్తా పేర్కొన్నారు. తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీలో గురువారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. యూనివర్సిటీలకు అందిస్తున్న నిధులను సరైన రీతిలో సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. మహిళలకు మంచి నైపుణ్య శిక్షణ అందివ్వడం ద్వారా ఉన్నత ఉపాధి కల్పన, తద్వారా మహిళా సాధికారతను సాధించడం వంటి లక్ష్యాలను ప్రభుత్వం నిర్దేశించుకుందన్నారు. ఈ లక్ష్యాలను క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలయ్యేలా అధికారులు కృషి చేయాలని కోరారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ రామ్మోహనరావు మాట్లాడుతూ.. ప్రస్తుతం లభిస్తున్న ఉపాధి అవకాశాలకు అనుగుణంగా విద్యార్థులకు అవగాహన కల్పించేలా యూనివర్సిటీలు ప్రయత్నించాలన్నారు. పద్మావతి యూనివర్సిటీ వీసీ ఉమ మాట్లాడుతూ.. పీఎం-ఉష పథకం ద్వారా యూనివర్సిటీకి మంజూరైన రూ. 100 కోట్లను పటిష్ట ప్రగతికి వినియోగిస్తున్నట్టు చెప్పారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.రజని, కేరళకు చెందిన ఐఏఎస్ అధికారి డాక్టర్ ఉష తదితరులు విద్య, నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పన అంశాల్లో తమ అనుభవాలను పంచుకున్నారు.



తిరుపతిలో ర్యాలీ నిర్వహిస్తున్న జర్నలిస్టులు

గళం విప్పిన కలం

- దాడులను ఖండిస్తూ రోడెక్కిన జర్నలిస్టులు
- క్రికెట్ కిట్టు ధరించి నిరసన
- మద్దతుగా నిలిచిన ప్రజా సంఘాలు, ప్రజా ప్రతినిధులు

తిరుపతి(వైద్యం), జూలై 10 (ఆంధ్రజ్యోతి): 'ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేస్తున్న జర్నలిస్టులపై దాడులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలి. జర్నలిస్టుల స్వేచ్ఛకు రక్షణ కల్పించాలి' అంటూ జర్నలిస్టు సంఘాల నేతలు, జర్నలిస్టులు డిమాండు చేశారు. బంగారుపాళ్యంలో బుధవారం ఆంధ్రజ్యోతి చిత్తూరు స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై వైసీపీ శ్రేణులు దాడికి పాల్పడటాన్ని ఖండించారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్ నుంచి నాలుగు కాళ్ల మండపం వరకు జర్నలిస్టులు నిరసన ర్యాలీ నిర్వహించారు. వీరికి ప్రజా సంఘాల నేతలు, ప్రజాప్రతినిధులు మద్దతుగా నిలిచారు. 'జర్నలిస్టులపై దాడులకు పాల్పడటమే లక్ష్యంగా వైసీపీ మూకలు తెగబడుతున్నాయి. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు అనంతపురంలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై ఇదే రీతిలో దాడికి పాల్పడ్డారు. అదే తరహాలో ఇప్పుడు ప్రతిపక్షంలోనూ ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై మూకుమ్మడిగా దాడికి దిగారు. ఇది సమాజానికి ఎంతమాత్రం శ్రేయస్కరం కాదు. శివకుమార్‌పై దాడికి పాల్పడిన వైసీపీ రౌడీ మూకలను శిక్షించి జర్నలిస్టులకు న్యాయం చేయాలి. శివకుమార్‌పై పది మందికిపైగా దాడికి పాల్పడుతున్న వీడియోలు, ఫొటోలు స్పష్టంగా ఉన్నప్పటికీ పోలీసులు గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసినట్లు కేసు నమోదు చేయడం, ప్రధాన నిందితులను వదిలేసి ఒకరిద్దరిపై కేసులు నమోదు చేస్తుండటం చూస్తుంటే పోలీసు వ్యవస్థపైనా నమ్మకం కోల్పోయే పరిస్థితి వచ్చే అవకాశం ఉంది. పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి దాడులకు పాల్పడిన వైసీపీ మూకలపై చర్యలు చేపట్టకుంటే రాష్ట్రస్థాయిలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం' అని హెచ్చరించారు. వైసీపీ మూకల దాడులకు భయపడి జర్నలిస్టులు రక్షణ కవచాలు వేసుకొని విధులకు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయంటూ క్రికెట్ రక్షణ కిట్ ధరించి నిరసన తెలిపారు. అనంతరం ధర్నా చేస్తున్న జర్నలిస్టులకు కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ మద్దతుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్ఎం ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గిరిబాబు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి పాలవల్లి నరేంద్ర, డీవైఎఫ్ఐ నేత జయచంద్ర, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మురళి, జర్నలిస్టు నేతలు సురేంద్రరెడ్డి, కోలా లక్ష్మీపతి, డీవైఎఫ్ఐ నేత జయచంద్ర, పలు జర్నలిస్టు సంఘాల నేతలు, ప్రజా సంఘ నాయకులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జగన్ బాధ్యత వహించాలి

జర్నలిస్టులపై దాడులకు పాల్పడటం అమానుషమైన ఘటన. ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టు శివకుమార్‌పై దాడికి పాల్పడిన వైసీపీ నేతలను, బాధ్యులను శిక్షించాలి. దీనికి మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యత వహించాలి. మళ్లీ వైసీపీ నేతలు ఇలాంటి ఘటనలకు గట్టి చర్యలు చేపట్టాలి.

- చింతా మోహన్, కేంద్ర మాజీ మంత్రి

జర్నలిస్టులపై దాడులు కొనసాగుతుండటం దౌర్భాగ్యం

జర్నలిస్టులపై దాడులకు పాల్పడే పరిస్థితులు కొనసాగుతుండటం నిజంగా దౌర్భాగ్యం. దీనిని అరికట్టాలంటే జర్నలిస్టులు ఐకమత్యంగా ఉండాలి. అధికారంలో ఉన్నా, లేకున్నా జర్నలిస్టులపై వైసీపీ నేతలు దాడులకు పాల్పడుతుండటం మానుకోవడం లేదు. జర్నలిస్టుల రక్షణకున్న చట్టాలను పక్కాగా అమలు చేయకపోవడం వల్లే ఈ దుస్థితి.

- ఆర్ఎం ఉమామహేశ్వరరావు, ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్

జర్నలిస్టులపై దాడులు సమాజానికి మంచిది కాదు

జర్నలిస్టులపై దాడులకు పాల్పడటం సమాజానికి ఎంతమాత్రం మంచిది కాదు. వైసీపీ నేతలు రౌడీల్లా వ్యవహరిస్తూ జర్నలిస్టులపై దాడులకు పాల్పడటం తీవ్రంగా ఖండిస్తున్నాం. నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలి.

- జయచంద్ర, డీవైఎఫ్ఐ నేత

దాడులకు పాల్పడిన వారిని శిక్షించాలి

ఫొటో జర్నలిస్టు శివకుమార్‌పై దాడికి పాల్పడిన వైసీపీ రౌడీ మూకలను కఠినంగా శిక్షించాలి. ఈ దాడులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా కారకులైన వారిపైనా చర్యలు తీసుకోవాలి. జర్నలిస్టుల స్వేచ్ఛను హరించేలా దాడులకు పాల్పడటాన్ని ఖండిస్తున్నాం.

- నరేంద్ర, ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి

24 గంటల్లోపు చర్యలు తీసుకోవాలి

ఫొటో జర్నలిస్టుపై వైసీపీ నేతల మూకుమ్మడి దాడి దారుణం. దాడులకు పాల్పడిన వారితోపాటు.. ప్రేరేపించిన వారిపైనా 24 గంటల్లోపు చర్యలు తీసుకోవాలి. జర్నలిస్టుల రక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి.

- మురళి, తిరుపతి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు

మాజీ డిప్యూటీ సీఎంపైనా చర్యలు తీసుకోవాలి

శివకుమార్‌పై దాడికి పాల్పడిన వారితోపాటు.. దాడికి ప్రేరేపించిన మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి మీద కూడా చర్యలు తీసుకోవాలి. వైసీపీ నేతలు వారి చేతగానితనాన్ని నిస్సహాయ స్థితిలో ఉన్న ఒక ఫొటో జర్నలిస్టుపై చూపారు.

- గిరిబాబు, రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు

వైసీపీ రౌడీలను అరెస్టు చేయండి: టీడీపీ



తిరుపతి, జూలై10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై దాడిచేసిన వైసీపీ రౌడీలను వెంటనే అరెస్టు చేయాలని తిరుపతి డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ డిమాండు చేశారు. ఈ దాడిని ఖండిస్తూ గురువారం తిరుపతి భవాని నగర్‌లోని టీడీపీ క్లస్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడారు. జర్నలిస్టులపై దాడిచేయడం వైసీపీ అల్లరిమూకలకు అలవాటుగా మారిపోయిందని మండిపడ్డారు. అధికారంలో లేకపోయినా వారి దౌర్జన్యాలకు అదుపేలేకుండా పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్ర కోటి సదాశివం, కూటమి నాయకులు మహేష్ యాదవ్, ఎస్వీఎం శ్రీధర్, సుబ్బుయాదవ్, వినోద్ రాయల్ జగన్నాథం, సుధాకర్ రెడ్డి, రవితేజ నాయుడు, రూపేష్, శరత్, దేవాచారి, చంద్ర రెడ్డి, సురేష్, శంకర్ యాదవ్,అబ్దుల్లా, ముని, రమేష్, గౌష్ బాషా, సమీర్,, ముని, చంద్ర ఆచారి, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

'స్కిట్'కు పూర్వవైభవం: సుధీర్



స్కిట్‌లో భవనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, జూలై 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (స్కిట్)లో ఈ ఏడాది తరగతులు ప్రారంభించనుండటంతో పూర్వవైభవం రానుందని ఎమ్మెల్యే సుధీర్ చెప్పారు. శ్రీకాళహస్తిలోని స్కిట్‌లోని తరగతి గదులు, ల్యాబ్‌లు, భవనం తదితరాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. తన తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి స్కిట్ ఏర్పాటు చేయించి స్థానిక విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందించారన్నారు. వైసీపీ పాలకులు దీనిని మూసేసి యువతకు ద్రోహం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో తాను ఇచ్చిన హామీ ప్రకారం తిరిగి ప్రారంభించడానికి ఏడాదిగా ప్రయత్నించానన్నారు. తన బాల్యమిత్రుడు, మంత్రి లోకేశ్ స్కిట్ కళాశాలను జేఎన్‌టీయూకు అనుసంధానం చేసి.. ముక్కంటి ఆలయానికి పైసా ఖర్చు లేకుండా ఈ విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభమయ్యేలా చేసిన కృషి మరువలేమన్నారు. ప్రభుత్వం నుంచి స్కిట్ అభివృద్ధికి త్వరలో రూ.120 కోట్లు మంజూరవుతాయన్నారు. మరోమూడు రోజుల్లోనే ఆరు బ్రాంచుల్లో 300మంది విద్యార్థులు మొదటి సంవత్సరంలో చేరేలా కసరత్తు ప్రారంభమైందన్నారు. దీని కోసం ఆరు తరగతి గదులు, ల్యాబ్, ప్రిన్సిపాల్ చాంబర్, ఇతర గదులను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో స్పేస్ టెక్నాలజీ.. మెడికల్ కళాశాలలను నెలకొల్పేలా ప్రభుత్వంలోని పెద్దలతో చర్చిస్తున్నానని చెప్పారు.

జీఎన్‌ఎస్ఎస్ ఈఈ హరిబాబుపై సస్పెన్షన్ ఎత్తివేత

- శ్రీకాళహస్తి డిప్యూటీ ఎస్ఈగా నియామకం

తిరుపతి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతి గాలేరు-నగరి డివిజన్ ఈఈ సీహెచ్ హరిబాబుపై సస్పెన్షన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఎత్తివేసింది. ఆయన్ను శ్రీకాళహస్తి జీఎన్ఎస్ఎస్ డిప్యూటీ ఎస్ఈగా నియమించింది. ఈయన తిరుపతి జీఎన్ఎస్ఎస్ డివిజన్‌కు ఎఫ్ఏసీ ఈఈగా పనిచేసిన సమయంలో హైదరాబాదుకు చెందిన ఓ కాంట్రాక్టు సంస్థకు నిబంధనలకు విరుద్ధంగా రూ.1.36 కోట్లు బ్యాంకు గ్యారెంటీలను రిలీజ్ చేశారన్న ఆరోపణలు ఎదుర్కొన్నారు. దానిపై ప్రభుత్వం గతేడాది డిసెంబరు 23న సస్పెండ్ చేసింది. శాఖాపరమైన విచారణకు ఆదేశించిన నేపథ్యంలో, సస్పెండు చేసి ఆరు నెలలు దాటినందున తనకు పోస్టింగ్ ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తూ గతనెల 4న లేఖ రాశారు. ఈ క్రమంలో సస్పెన్షన్ ఎత్తివేస్తూ గతనెల 30న ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం.. తాజాగా శ్రీకాళహస్తి డివిజన్‌కు డిప్యూటీ ఎస్ఈగా నియమించింది.

వరసిద్ధుడికి బంగారు విభూది పట్టీ కానుక



బంగారు విభూది పట్టీని విరాళంగా అందిస్తున్న దాత



ఐరాల(కాణిపాకం), జూలై 10(ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడికి ఎన్‌ఆర్‌ఐ చంద్రశేఖర్ గురువారం రాళ్ల పొదిగిన బంగారు విభూది పట్టీని కానుకగా అందించారు. 140 గ్రాముల బరువున్న ఈ పట్టీ రూ.14,00,000 విలువ చేస్తుందని ఈవో కిషోర్ తెలిపారు. ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ రంగస్వామి, ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



శాకాంబరి అలంకారంలో మరగదాంబిక - పుట్టబొమ్మకు కూరగాయలతో అలంకారం - కూరగాయలతో అమ్మవారి అలంకారం

శాకాంబరి అలంకారంలో మరగదాంబిక

ఐరాల(కాణిపాకం), జూలై 10(ఆంధ్రజ్యోతి):కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి అనుబంధ ఆలయమైన మరగదాంబిక సమేత మణికంఠేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఆషాడ పౌర్ణమిని పురస్కరించుకుని మరగదాంబిక శాకాంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాడ పౌర్ణమి సందర్భంగా ప్రధాన ఆలయంతో పాటు అనుబంధ ఆలయాలను వివిధ రకాల కూరగాయలతో శోభాయమానంగా అలంకరించారు.కర్ణాటక రాష్ట్రం వడ్డిపల్లె,కోలారు,ముల్బాగల్, బెంగళూరు, తమిళనాడు రాష్ట్రంలోని హోసూరు ప్రాంతం మార్కెట్ల ప్రతినిధులు అలంకరణ కోసం 20 టన్నుల కూరగాయలను అందజేశారు.మణికంఠేశ్వర స్వామి ఆలయంలో వంకాయలు, ముల్లంగి,క్యారెట్, కాకరకాయలతో ఏర్పాటు చేసిన అమ్మవారి, పుట్ట ఆకృతులు భక్తులను ఆకట్టుకున్నాయి.ఎమ్మెల్యే మురళీమోహన్ ప్రధాన ఆలయం నుంచి సారెను తీసుకొచ్చి మణికంఠేశ్వర స్వామి ఆలయంలో అర్చకులకు అందించి పూజల్లో పాల్గొన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు హరిబాబు నాయుడు, నాయకులు మణి నాయుడు,ఆలయ ఏఈవో రవీంద్రబాబు,సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు తదితరులు పాల్గొన్నారు.



సారె తీసుకొస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్ తదితరులు

బీసీవై పార్టీ అధ్యక్షుడికి ఉపశమనం

అమరావతి, జూలై 10(ఆంధ్రజ్యోతి): బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్‌కు హైకోర్టులో ఉపశమనం లభించింది. హైవేను దిగ్బంధించి, వాహనదారులకు ఆటంకం కలిగించారంటూ నమోదైన కేసులో రామచంద్ర యాదవ్‌తో పాటు మరో 38 మందికి బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్. హరినాథ్ గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో ఇండోసోల్ ప్రాజెక్ట్ కోసం భూసేకరణను నిరసిస్తూ ర్యాలీలు, హైవే దిగంధం ద్వారా వాహనదారులకు ఆటంకం కలిగించారంటూ పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ రామచంద్ర యాదవ్‌తోపాటు మరో 38 మంది హైకోర్టులో వేసిన పిటిషన్ గురువారం విచారణకు వచ్చింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది పీవీజీ ఉమేశ్‌చంద్ర వాదనలు వినిపిస్తూ పిటిషనర్లపై పోలీసులు నమోదు చేసిన సెక్షన్లన్నీ ఏడేళ్లలోపు శిక్షకు వీలున్నవేనన్నారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం వారందరికీ సెక్షన్ 35(3) ప్రకారం నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది.

అన్నదానానికి రూ.2 లక్షల విరాళం



విరాళం అందిస్తున్న దాతలు లత, మునస్వామి

ఐరాల(కాణిపాకం), జూలై 10 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి పాకాలకు చెందిన మునస్వామి రూ.1,00,016, చిత్తూరుకు చెందిన లత రూ.1,00,001, గో సంరక్షణ ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాసరావు రూ.1,01,116 గురువారం విరాళంగా అందించారు. విరాళదాతలను ఆలయ ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం దాతలను వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు.ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి ఆలయానికి ఎలక్ట్రిక్ బైక్ కానుక



ఎలక్ట్రిక్ బైక్‌ను అందిస్తున్న దాత

ఐరాల(కాణిపాకం), జూలై 10(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాక వరసిద్ధుడి ఆలయానికి చిత్తూరుకు చెందిన శ్రీశ్రీనివాస మోటర్స్ జీవరత్నంరెడ్డి ఎలక్ట్రిక్ బైక్‌ను కానుకగా అందించారు. ఈ సందర్భంగా ఈవో పెంచలకిషోర్ మాట్లాడుతూ బైక్ రూ.1,30,000 విలువ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం దాతకు స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదమంత్రాలతో ఆశ్వీదించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు. డీఈవో సాగర్‌బాబు, ఏఈవోలు రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత లక్ష్యాలు సాధ్యం

● కలెక్టర్ సుమిత్ కుమార్



రొంపిచెర్ల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉన్నత లక్ష్యాలు సాధ్యమని.. పిల్లల విషయాల్లో తల్లిదండ్రులు భాగస్వామ్యం కావాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. గురువారం రొంపిచెర్లలోని మోడల్ పాఠశాలలో మెగా పీటీఎం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తున్నామని, రుచికరమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలన్నారు. మూడు నెలలకోసారి నిర్వహించే పీటీఎంకు తల్లిదండ్రులు తప్పక హాజరవ్వాలని సూచించారు. ఐదు నెలల్లోపు మోడల్ స్కూల్లో నిర్మాణంలో ఉన్న తరగతి గదులను పూర్తి చేస్తామని తెలిపారు. ఎస్పీ మణికంఠ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, కళాశాలల్లో విద్యార్థులు ఘర్షణలకు దిగరాదని సూచించారు. చల్లా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం తీసుకొస్తున్న పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు అమర్‌నాథరెడ్డి, ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, ఎంఈవోలు శ్రీనివాసులు, ఇందిరా, నాయకులు పాల్గొన్నారు.

పంటలపై గజరాజుల విధ్వంసం

కల్లూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై గజరాజులు విధ్వంసం సృష్టిస్తున్నాయి. పగలంతా అడవిలో సంచరిస్తూ రాత్రి వేళలో పొలాల్లోకి ప్రవేశించి పంటలను ధ్వంసం చేయడం కొనసాగిస్తుండటంతో రైతులకు అపారనష్టం కలుగుతోంది. పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోని గోగులమ్మ వంక నుంచి బుధవారం రాత్రి బయలుదేరిన 16 ఏనుగుల గుంపు ముందుగా పాతపేట వద్దకు చేరుకున్నాయి. గ్రామంలోని రమేష్, మధుసూదన్, సుబ్రహ్మణ్యంలకు చెందిన మామిడి చెట్ల కొమ్మలను ఏనుగుల గుంపు విరిచేశాయి. రైతు వై.సుబ్రహ్మణ్యానికి చెందిన మిరప, పశుగ్రాసాన్ని ధ్వంసం చేశాయి. రైతు దొరస్వామికి చెందిన పూలచెట్లను తొక్కేసిన ఏనుగులు మరో రైతు మునస్వామికి చెందిన పైపులను విరిచేశాయి. అక్కడి నుంచి చల్లావారిపల్లి వద్దకు చేరుకున్న ఏనుగుల గుంపు గ్రామంలోని రైతు దామోదర్‌నాయుడుకు చెందిన టమెటా పంటను ధ్వంసం చేశాయి. ఇదే గ్రామానికి చెందిన మరో రైతు మునిరత్నంనాయుడుకు చెందిన కొబ్బరిచెట్లను ఏనుగులు ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోకి తిరుగుముఖం పట్టాయి. గురువారం పగలంతా గోగులమ్మ వంక సమీపంలో ఏనుగుల గుంపు సంచరిస్తున్నట్లు ప్రజలు తెలిపారు.



ఏనుగుల దాడిలో ధ్వంసమైన టమోటా పంట

యూరియా కొరతపై ఆందోళన వద్దు

చిత్తూరు సెంట్రల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా కొరతపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో అవసరమైన మేరకు ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. రైతు సేవా కేంద్రాల్లో 650 మెట్రిక్ టన్నుల నిల్వలు ఉంచగా, ప్రైవేటు రిటైలర్స్ వద్ద వెయ్యి మెట్రిక్ టన్నులు, గ్రోమోర్ సెంటర్లలో వంద మెట్రిక్ టన్నులు, మార్క్‌ఫెడ్ గోడౌన్‌లో 1800 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. అధిక ధరలకు ఎరువులు విక్రయించినా, కృత్రిమ కొరత సృష్టించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కర్నూలుపై చిత్తూరు జట్టు ఘన విజయం



లోహిత్ లక్ష్మీనారాయణ

కడప స్పోర్ట్స్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్- 19 మెన్స్ మల్టీ డే (మూడు రోజుల) క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా గురువారం కర్నూలుతో జరిగిన మ్యాచ్‌లో చిత్తూరు జట్టు 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఏసీఏ క్రికెట్ మైదానంలో జరిగిన ఈ మ్యాచ్‌లో మొదట కర్నూలు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 77.4 ఓవర్లలో 282 పరుగులకు ఆలౌట్ కాగా, తదుపరి బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 63.4 ఓవర్లలో 251 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో కర్నూలు జట్టుకు 31 పరుగుల ఆధిక్యత లభించింది. అనంతరం రెండోరోజు కర్నూలు జట్టు 71.2 ఓవర్లలో 272 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో మొత్తం రెండు ఇన్నింగ్స్‌లకు కలిపి 303 పరుగులు ఆధిక్యత సాధించింది. ఇందులో హృదయ్ 85, విఖ్యాత్ 85 పరుగులు చేశారు. అనంతరం మూడోరోజు గురువారం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన చిత్తూరు జట్టు 42.2 ఓవర్లలో కేవలం మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి విజయానికి అవసరమైన 304 పరుగులు సాధించి జయకేతనం ఎగురవేసింది. ఇందులో లోహిత్ లక్ష్మీనారాయణ 138 పరుగులు సాధించారు.

ఎయిర్‌పోర్టు భూములకు రూ.25 కోట్ల పరిహారం పంపిణీ



కుప్పం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం, రామకుప్పం మండలాల మధ్య నిర్మించ తలపెట్టిన విమానాశ్రయం కోసం సేకరించిన భూములకు పరిహారంగా రూ.25 కోట్లు అందింది. విమానాశ్రయం కోసం 2014-2019 నడుమ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు 2018వ సంవత్సరంలో 443 ఎకరాల భూమిని సేకరించింది. ప్రభావిత రైతులు 210మందిగా తేలారు. రైతులకు కొంతమందికి అప్పట్లోనే నష్టపరిహారం చెల్లించారు. మిగిలిన 123మంది రైతులకు చెల్లించాల్సిన రూ.13కోట్ల పరిహారం పెండింగులో ఉండిపోయింది. ఈ రైతులకు చక్రవడ్డీతో కలిసి ప్రస్తుతం మొత్తం 25,90,87,824రూపాయలు విడుదలయ్యాయి. ఈ నేపథ్యంలో నష్టపరిహారం చెక్కులను గురువారం రాత్రి కడా కార్యాలయంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, కడా పీడీ వికాస్ మరమ్మత్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసరాజు, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌కు ప్రముఖుల పరామర్శ

ఫోన్లో మాట్లాడిన సీఎం చంద్రబాబు ● ధైర్యం చెప్పిన ఎంపీ, ఎమ్మెల్యేలు



శివకుమార్‌ను పరామర్శిస్తున్న ఎంపీ ప్రసాదరావు - ఎమ్మెల్యే పులివర్తి నాని - ఎమ్మెల్యే థామస్

చిత్తూరు రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మూకల దాడిలో గాయపడిన చిత్తూరు ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శివకుమార్‌ను గురువారం ప్రముఖులు పరామర్శించారు. సీఎం చంద్రబాబు ఫోన్ చేసి శివకుమార్‌ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని, ఇప్పటివరకు నిర్వహించిన వైద్య పరీక్షలు, అందుతున్న చికిత్స గురించి కనుక్కున్నారు.టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు, సీఎం చీఫ్ పీఆర్వో రమేష్ ఆంధ్రజ్యోతి చిత్తూరు స్టాఫ్ రిపోర్టర్ కరీమ్‌కు కాల్ చేసి వివరాలు తెలుసుకున్నారు.పోలీసులు కేసు నమోదుచేసి, నిందితుల్ని అదుపులోకి తీసుకున్నారా అని ఆరా తీశారు. అనంతరం శివకుమార్‌తో ఫోన్లో మాట్లాడి దాడి జరిగిన తీరును కనుక్కున్నారు. చిత్తూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న శివకుమార్‌ను చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు పరామర్శించి భరోసానిచ్చారు. దాడి ఘటనకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే విషయంలో కూటమి ప్రభుత్వం ఎంత మాత్రం వెనుకాడదన్నారు.ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలిపారు. అనంతరం శివకుమార్‌ను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పరామర్శించి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. అన్నివిధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. గురువారం రాత్రి జీడీనెల్లూరు ఎమ్మెల్యే థామస్ ఆస్పత్రికి వెళ్లి శివకుమార్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు. నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు సతీమణి లావణ్య మధ్యాహ్నం ఆస్పత్రికి వెళ్లి శివకుమార్‌ను పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ ఫొటోగ్రాఫర్‌ను పరామర్శించారు.చిత్తూరు పార్లమెంట్ తెలుగు మహిళా విభాగ అధ్యక్షురాలు కాజ్జాల అరుణ, సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు తదితరులు శివకుమార్‌ను పరామర్శించారు. చిత్తూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాజూరు బాలాజీ పరామర్శించడంతో పాటు మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి వీడియో కాల్ చేసి శివకుమార్‌తో మాట్లాడించారు.

కుటుంబ సభ్యుల ముందే ఆత్మహత్య

చిత్తూరు అర్బన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): భార్యతో ఘర్షణ పడి భర్త కత్తితో గొంతు కోసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం జరిగింది. రెండో పట్టణ పోలీసుల వివరాల మేరకు.. స్థానిక కాజూరుకు చెందిన సాహిల్‌షా(40), భార్య తామ్మన్నీషా, బిడ్డలతో కలిసి నివాసముంటున్నారు. మద్యానికి బానిసైన సాహిల్‌షా తరచూ భార్యతో గొడవపడుతుండేవాడు. ఈ క్రమంలో గురువారం భార్యతో ఘర్షణ పడి అందరూ ఇంట్లో ఉండగానే కత్తితో గొంతుకోసుకున్నాడు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

తేలుకాటుతో ఏడేళ్ల బాలిక మృతి



గేక్షిత
(ఫైల్‌ఫొటో)

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాంపాళెం దళితవాడలో తేలుకాటుతో ఏడేళ్ల బాలిక మృతి చెందింది. అక్కరపాకం వెంకటేశు, నవీన దంపతుల కుమార్తె గేక్షిత(7). మండల కేంద్రంలోని శ్రీనివాసతేజ ప్రైవేటు పాఠశాలలో 2వ తరగతి చదువుతోంది. రెండు రోజుల క్రితం ఇంటిపైన ఆడుకుంటుండగా తేలు కుట్టింది. గమనించిన తల్లిదండ్రులు శ్రీకాళహస్తిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయా కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందింది.

గురుపౌర్ణమి గరుడసేవ

తిరుమల, జులై 10 (ఆంధ్రజ్యోతి):గురుపౌర్ణమి సందర్భంగా తిరుమలలో గురువారం రాత్రి గరుడ వాహనసేవ వైభవంగా జరిగింది. ఆహ్లాదకర వాతావరణంలో తన ఇష్టవాహనమైన గరుడుడిపై సర్వాలంకార భూషితుడై మలయప్ప స్వామి నాలుగు మాడవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు, గోవింద నామ స్మరణల మధ్య గరుడుడిపై గోవిందుడు భక్తులను కటాక్షించారు. గురుపౌర్ణమి కావడంతో తిరుమల, తిరుపతి స్థానికులతో పాటు భక్తులు భారీగా మాడవీధుల్లోని గ్యాలరీల్లోకి చేరి కర్పూర నీరాజనాలతో మలయప్ప స్వామిని దర్శించుకున్నారు. వాహనసేవలో కేంద్రమంత్రి బండి సంజయ్, జీయర్‌స్వాములు, బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, అదనపు ఈవో వెంకయ్య చౌదరి పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ఘనస్వాగతం

రేణిగుంట జూలై 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజీవ్‌కు తిరుపతి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. శ్రీవారి దర్శనార్థం గురువారం మధ్యాహ్నం ఇండిగో విమానంలో తిరుపతి విమానాశ్రయం చేరుకున్న ఆయనకు టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

ఎస్సీల జోలికొస్తే ఊరుకోను

నారాయణస్వామిపై థామస్ ధ్వజం

వెదురుకుప్పం, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఎస్సీల జోలికొస్తే చూస్తూ ఊరుకోబోనని వైసీపీ నేత నారాయణస్వామిని జీడీనెల్లూరు ఎమ్మెల్యే థామస్ హెచ్చరించారు. ఎస్సార్‌పురం మండలం కొత్తపల్లిమిట్టలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎస్సీల మీద కేసులు పెట్టించలేదని బుకాయిస్తున్న నారాయణస్వామి వెదురుకుప్పం మండలం యనమలమందలోనే యాభైమంది ఎస్సీలమీద కేసులు పెట్టించింది మర్చిపోయారంటూ ఫైర్ అయ్యారు.బంగారుపాళ్యంలో జగన్ పర్యటన సందర్భంగా న్యూస్ కవరేజీకి వెళ్లిన ఫొటోగ్రాఫర్‌పై దాడి చేయించడాన్ని థామస్ తీవ్రంగా ఖండించారు.జగన్‌కి నిజంగా చిత్తశుద్ధి ఉంటే మామిడి రైతులను కలసి సహాయం చేసి ఉండాలని, అయితే వ్యవహరించిన తీరు చూస్తుంటే ప్రజాస్వామ్యంలో ఉన్నామా? ఇంకెక్కడ ఉన్నామా అన్న అనుమానాలు వస్తున్నాయన్నారు. వైసీపీ పాలనలో జగన్ ఏ రోజైనా మామిడి రైతుల గురించి ఆలోచించారా అంటూ మండిపడ్డారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

కల్లూరు పోలీస్‌స్టేషన్ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

కల్లూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు పోలీస్‌స్టేషన్‌ను గురువారం మధ్యాహ్నం జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ రికార్డులను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్ పరిధిలోని గ్రామాల పరిస్థితులపై సీఐ సూర్యనారాయణ, ఎస్ఐ వెంకటేశ్వర్లులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ, మహిళా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణకు గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. లోన్ యాప్, సైబర్ మోసాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు.

బలిజ కమ్యూనిటీ భవన స్థలంలో ప్రహరీ నిర్మాణానికి రూ.30 లక్షలు



స్థలాన్ని సందర్శించిన పీడీతో బలిజ కులస్తులు

కుప్పం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కుప్పం మున్సిపాలిటీ పరిధిలో బలిజ కమ్యూనిటీ భవనం కోసం కేటా యించిన స్థలంలో ప్రహరీ నిర్మాణం కోసం రూ.30 లక్షల నిధులు మంజూరు చేస్తామని కడా పీడీ వికాస్ మర్మత్ హామీ ఇచ్చారు. ఆయన గురువారం సంబంధిత స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు నిధులను మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో బలిజ కులస్తులు పలువురు పాల్గొన్నారు.

20 నుంచి కూసూరులో ఆడికృత్తిక మహోత్సవాలు



గోడ పత్రికలు ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు తదితరులు

కుప్పం రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం చెక్కునత్తం పంచాయతీ కూసూరు గ్రామం పెరిపల్లం వద్ద వెలసిన బాలసుబ్రహ్మణ్యస్వామి వారి ఆడికృత్తిక మహోత్సవాలు ఈనెల 20 నుంచి ప్రారంభం కానున్నాయి. ఆలయం ఆవరణలో గురువారం సంబంధిత గోడ పత్రికలను ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెక్కునత్తం మణి, కనకరాజు, దేవేంద్ర, మునిరత్నం, సుందర్, నాగవేలు, తిమ్మప్ప, వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

యోగానందలో గురుపౌర్ణమి వేడుకలు



తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

శాంతిపురం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలం కూతేగానిపల్లెలోని పరమహంస యోగానంద విద్యాలయంలో గురుపౌర్ణమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. అనంతరం చిన్నపిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పాదపూజలు చేశారు. విద్యాలయం ప్రిన్సిపాల్ ఆజాద్‌హుస్సేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలతో మోసం: వైసీపీ



సమావేశంలో మాట్లాడుతున్న కరుణాకర్‌రెడ్డి

సదుం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ హామీలతో చంద్రబాబు ప్రజలను మోసం చేశారని తిరుపతి, చిత్తూరు జిల్లాల వైసీపీ అధ్యక్షుడు కరుణాకర రెడ్డి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆరోపించారు. సదుం మండలం ఎర్రాతివారిపల్లెలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' పేరుతో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. చిత్తూరు జిల్లాలో మామిడి రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తుంటే స్పందించిన చంద్రబాబు తనకు రాజకీయాలే ముఖ్యమన్నట్లు భావిస్తున్నారన్నారు. చంద్రబాబు రీకాలింగ్ మేనిఫెస్టో క్యూఆర్ కోడ్‌తో పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప, పుంగనూరు మున్సిపల్ చైర్మన్ అలీమ్, వైసీపీ ప్రధాన కార్యదర్శి పెద్దిరెడ్డి, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీతోనే మైనార్టీలకు గుర్తింపు



వైసీపీ నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

పుంగనూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీతోనే మైనార్టీలకు గుర్తింపు ఉంటుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక మేలుపట్ల నుంచి భారీ సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా కొత్తపేట, ఎన్టీఆర్ సర్కిల్, ప్రైవేటు బస్టాండ్, ఇందిరాసర్కిల్ మీదుగా ఎంబీటీ రోడ్డులోని షాదీమహల్ వరకు ర్యాలీ చేశారు. షాదీమహల్‌లో ఏర్పాటు చేసి సమావేశంలో పట్టణ అంజుమాన్ కమిటీ కార్యదర్శి ఇబ్రహీం ఆధ్వర్యంలో కొయ్యపని, ఎలక్ట్రికల్ సంఘనాయకులతోపాటు 200 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

కుప్పం నర్సింగ్ కళాశాలలో మెడికల్ కోడింగ్ కోర్సు



ఎంవోయూ కుదుర్చుకుంటున్న సునీల్ రాజ్ తదితరులు

కుప్పం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): బీసీఎన్ విద్యా సంస్థలకు చెందిన కుప్పం నర్సింగ్ కళాశాలలో మెడికల్ కోడింగ్ కోర్సులో విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. థ్రెట్ ఎడ్యుకేర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధి భరత్‌తో బుధవారం కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ సునీల్‌రాజ్ ఈమేరకు ఎంవోయూ కుదుర్చుకున్నారు. మెడికల్ కోడింగ్ కోర్సు ప్రయోజనాలను గురించి ఈ సందర్భంగా ఆయన వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విమలా జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

గృహహింస చట్టం మహిళలకు కవచం



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి లిఖిత

పలమనేరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : గృహహింస చట్టం మహిళలకు ఒక కవచంలా పనిచేస్తోందని పలమనేరు జూనియర్ సివిల్ జడ్జి లిఖిత పేర్కొన్నారు. గురువారం పలమనేరు వెలుగు కార్యాలయంలో టైలరింగ్ లో శిక్షణ పొందుతున్న మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మహిళా వేధింపుల నివారణ కోసం 2005లో ఈ చట్టాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పలమనేరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్.భాస్కర్, సీనియర్ న్యాయవాది అరీఫుల్లాఖాన్, ఏపీఎం మొగిలీశ్వరయ్య, మహిళలు పాల్గొన్నారు.

కుప్పం ఉద్యానశాఖ ఏడీగా పల్లవి



కుప్పం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కుప్పం డివిజన్ ఉద్యానశాఖ సహాయ సంచాలకులుగా (ఏడీ) టీపీ పల్లవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లాలో ఉద్యానశాఖాధికారిగా బాధ్యతలు నిర్వహించిన ఆమె పదోన్నతిపై కుప్పం వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఏడీ పల్లవి మాట్లాడుతూ కుప్పం డివిజన్‌లో ఉద్యాన పంటల సాగు అభివృద్ధికి, ఉద్యాన రైతుల సంక్షేమానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. పథకాలు, ఉద్యాన పంటల సాగు, సాంకేతిక సలహాలు అవసరమైన రైతులు ఫోన్‌నంబర్ 8886904257ను సంప్రదించాలని కోరారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



రోగులకు చికిత్సలందిస్తున్న వైద్యులు

రామకుప్పం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కుప్పం పీఈఎస్ వైద్యకళాశాల ఆస్పత్రి, ధార్మిక్ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం విజలాపురంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 175 మంది రోగులకు వైద్య చికిత్సలందించారు. 35 మంది రోగులను మెరుగైన వైద్య చికిత్సల కోసం పెద్దాస్పత్రులకు రెఫర్ చేశారు. స్థానిక కస్తూరిబా విద్యాలయం విద్యార్థులకు వైద్యులు వైద్య పరీక్షలు చేసి ఆరోగ్య సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో కస్తూర్బా విద్యాలయం ప్రత్యేకాధికారి అమరావతి, ధార్మిక్ సేవా సమితి అధ్యక్షుడు మహేష్, పీఈఎస్ ఆస్పత్రి వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ప్రత్యేక చర్యలు



అధికారులతో సమీక్షిస్తున్న జడ్పీచైర్మన్ శ్రీనివాసులు

బైరెడ్డిపల్లె, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని జడ్పీచైర్మన్ శ్రీనివాసులు సూచించారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన జడ్పీసీఈవో రవికుమార్‌నాయుడుతో కలిసి తాగునీటి సమస్యపై అధికారులతో సమీక్షించారు. ఎక్కడైనా తాగునీటి సమస్య ఎదురైతే వెంటనే పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో రాజేంద్రబాలాజీ, డిప్యూటీ ఎంపీడీవో నాగార్జునరెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వృద్ధుడి మృతి



మృతి చెందిన వృద్ధుడు

గుడుపల్లె, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బిసానత్తం సమీపంలోని రైలు పటాలపై పడి గురువారం గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. బిసానత్తం రైల్వే స్టేషన్ సమీపంలో సుమారు 65 సంవత్సరాల వృద్ధుడు మృతి చెందిన విషయాన్ని రైల్వే కీమాన్ గుర్తించి స్టేషన్ మాస్టర్, బంగారుపేట రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. నీలం రంగు చొక్కా, నల్లని రంగు నిక్కరు ధరించినట్లు తెలిపారు. బంగారుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరువణ్ణామలై భక్తులకు అన్నదానం



తాగునీరు, భోజనం ప్యాకెట్లు అందజేస్తున్న దాతలు

పుంగనూరు రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమి సందర్భంగా తమిళనాడు రాష్ట్రంలోని తిరువణ్ణామలై వెళతున్న భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ మేనేజర్ పావని బస్సు సర్వీసులు ఏర్పాటు చేశారు. గురువారం పట్టణం నుంచి బయలుదేరిన భక్తులకు దాతలు భోజనం ప్యాకెట్లు, తాగునీరు అందించారు. ప్రతి నెల పౌర్ణమి రోజు ఆర్టీసీ సర్వీసులు నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

విద్యతోనే వికాసం

పాఠశాలలు, కళాశాలల్లో పీటీఎం విజయవంతం



కుప్పం మండలం గరిగచీనేపల్లెలో విద్యార్థులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు



పలమనేరు: పెంగరగుంట పాఠశాలలో తల్లులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

కుప్పం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే వికాసం సాధ్యమవుతుందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. కుప్పం నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాలు అట్టహాసంగా పండుగ వాతావరణంలో నిర్వహించారు. కుప్పం మండలం గరిగచీనేపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల, శాంతిపురం మోడల్ స్కూళ్లలో జరిగిన తల్లిదండ్రుల సమావేశాలలో ఆయన పాల్గొన్నారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. కంగుంది జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం పాల్గొని మొక్కలు పంపిణీ చేశారు. గోనుగూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో గురువారం మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం ఘనంగా జరిగింది. తల్లిదండ్రులకు విద్యార్థులు పాదపూజ చేశారు.

● **గుడుపల్లె:** ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. గురువారం గుడుపల్లె ఉన్నత పాఠశాల సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

● **రామకుప్పం/శాంతిపురం:** రాష్ట్రంలో విద్యావ్యవస్థ బలోపేతంగా మారుతోందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. గురువారం రామకుప్పం మండలం ఆరిమానిపెంట ఉన్నత పాఠశాల, శాంతిపురం ఆదర్శ పాఠశాలల్లో జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. పాఠశాలల్లో జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, పార్టీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి మాట్లాడారు.

● **పలమనేరు:** పలమనేరు మండలంలోని ఉన్నత పాఠశాలల్లో గురువారం జరిగిన ఆత్మీయ సమావేశాలు పండుగ వాతావరణాన్ని సంతరించుకొంది. మండలంలోని పెంగరగుంట ఉన్నత పాఠశాలలో టీడీపీ మండలాధ్యక్షులు నాగరాజరెడ్డి పాల్గొని మాట్లాడారు.

● **బైరెడ్డిపల్లె:** మండలంలోని అన్ని పాఠశాలల్లో పీటీఎం నిర్వహించారు. కమ్మనపల్లె గురుకుల పాఠశాలలో జడ్పీసీఈవో రవికుమార్‌నాయుడు పాల్గొని సూచనలు చేశారు.

● **పెద్దపంజాణి** : మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల సమావేశాలు విజయవంతంగా చేపట్టారు. ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.

● **సోమల:** సోమల, కందూరు ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పీటీఎంలో మండల ప్రత్యేకాధికారి గీత పాల్గొని ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

● **కల్లూరు:** పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన పీటీఎంకు రామచంద్రారెడ్డి హాజరయ్యారు.

● **చౌడేపల్లె:** మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పీటీఎం నిర్వహించారు. పుదిపట్ల హైస్కూల్‌లో ఎంఈవో కేశరెడ్డి, చౌడేపల్లెలో ఎంపీడీవో లీలామాధవి పాల్గొన్నారు.

● **వి.కోట:** క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడంతో ఉన్నత శిఖరాలకు చేరుకోగలమని అమ్మాక్స్ సీఈవో దశరథరెడ్డి అన్నారు. గురువారం వి.కోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్‌కు హాజరై విద్యార్థులకు చదువు ప్రాముఖ్యతను వివరించారు.

● **పుంగనూరు రూరల్:** పిల్లల పెంపకంలో తల్లి పాత్ర కీలకమని సీఐ సుబ్బరాయుడు సూచించారు. గురువారం స్థానిక బసవరాజ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్, ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాలికలు కళాశాలకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్లిన తర్వాత వారి ప్రవర్తనపై తల్లి దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగాధర్‌నాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.



పుంగనూరు : కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ సుబ్బరాయుడు



బైరెడ్డిపల్లె : కమ్మనపల్లెలో పాల్గొన్న జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు



చౌడేపల్లె మండలం మేకలచిన్నేపల్లెలో మొక్కలు నాటుతున్న అధికారులు, విద్యార్థులు

స్వర్ణాంధ్ర విజన్-2047తో రాష్ట్రాభివృద్ధి

● చల్లా రామచంద్రారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి

చౌడేపల్లె, జూలై 10 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర విజన్-2047తో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో స్వర్ణాంధ్ర-2047 అభివృద్ధి ప్రణాళికపై నియోజకవర్గ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు విజన్ ఉన్న నాయకుడని, ఆయన గతంలో సమైక్యాంధ్రలో విజన్-2020 పేరుతో ఉమ్మడి ఏపీ రాజధాని హైదరాబాద్‌లో హైటెక్ సిటీని అభివృద్ధి చేశారన్నారు. పీ4 ద్వారా బంగారు కుటుంబాలు గుర్తించి వారి ఆర్థికంగా స్థిరపడ్డ వ్యక్తులు దత్తత తీసుకుని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. మండలంలోని సుదర్శన్‌రాజు, లక్ష్మీపతిరాజు, ప్రదీప్‌రాజు, డాక్టర్ సురేంద్రబాబు బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా డ్వామా పీడీ, నియోజకవర్గ ప్రత్యేకాధికారి రవికుమార్ మాట్లాడుతూ నియోజవకర్గంలో 9541 బంగారు కుటుంబాలు ఉన్నాయని.. ప్రస్తుతం నియోజకవర్గంలో తలసరి ఆదాయం రూ.7500 ఉందని, 2029 సంవత్సరానికి రూ.15 వేలకు పెంచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో లీలామాధవి, పుంగనూరు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, ఏడీ శ్రీనివాసులు, కురబ కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, టీడీపీ నాయకులు ప్రదీప్‌రాజు, పగడాల హరిప్రసాద్, కార్తిక్, శివకుమార్, రామకృష్ణ, మహ్మద్ గని, అమీద్‌ఖాన్, అధికారులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం



భూమి పూజ చేస్తున్న కంచర్ల శ్రీకాంత్ తదితరులు

గుడుపల్లె, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని సచివాలయ కాంప్లెక్స్ పనులకు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూగత వైసీపీ ప్రభుత్వ హయాంలో కుప్పం నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదన్నారు. పొగురుపల్లెలో కొత్తగా మూడు పరిశ్రమలతో పాటు మరో ఐదు పరిశ్రమలు త్వరలో ఏర్పాటు కానున్నట్లు తెలిపారు. ప్రజలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు విజన్‌తో ముందుకెళుతున్నట్లు తెలిపారు. మంచి చేసే ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని కోరారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, సమన్వయ కమిటీ కన్వీనర్ చంద్రశేఖర్, మండలాధ్యక్షులు బాబునాయుడు, మాజీ ఎంపీపీ మునిరాజు, జనసేన కుప్పం సమన్వయకర్త నరేష్, జనసేన మండలాధ్యక్షులు అమీర్, హేమాంబర్ గౌడ్, సుబ్బు, భానుమూర్తి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలి

పుంగనూరు రూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): స్థానిక బసవరాజ ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యార్థులకు పాఠశాలలో తయారు చేసిన మధ్యాహ్న భోజనంలో నాణ్యత లేదంటూ విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన వ్యక్తం చేశారు. గురువారం భోజనం సక్రమంగా ఉడకలేదని, కోడి గుడ్డు సగభాగం ఉడికించి విద్యార్థులకు వడ్డిస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపించారు. పరిశీలించి చర్యలు తీసుకుంటానని ఎంఈవో నటరాజరెడ్డి వారికి హామీ ఇచ్చారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

పుంగనూరు రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మైనార్టీ ఐటీఐలో ప్రవేశానికి అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఈనెల 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వివరాలకు ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని కోరారు.

ఫొటోగ్రాఫర్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి



కుప్పం డీఎస్పీ పార్థసారథికి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు



పుంగనూరులో ర్యాలీ చేస్తున్న జర్నలిస్టులు



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న పలమనేరు ప్రింట్ మీడియా జర్నలిస్టులు

కుప్పం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి చిత్తూరు స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేసి చట్టపరంగా శిక్షించాలని కుప్పం నియోజకవర్గ జర్నలిస్టులు డిమాండ్ చేశారు. దాడికి నిరసనగా కుప్పంలో గురువారం కడా కార్యాలయం నుంచి డీఎస్పీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. డీఎస్పీ పార్థసారథికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన నియోజకవర్గ జర్నలిస్టులు పాల్గొన్నారు.

● **పలమనేరు:** చిత్తూరు ఆంధ్రజ్యోతి సీనియర్ ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం పలమనేరులో ఆర్డీవో పి.భవానికి ప్రింట్ మీడియా జర్నలిస్టులు వినతి పత్రం అందజేశారు. తక్షణమే సమగ్ర విచారణ జరిపి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విలేకర్లకు రక్షణ కల్పించాలని కోరారు.

● **పుంగనూరు:** జర్నలిస్టులపై దాడులు చేయడం అమానుషమని జర్నలిస్టులు, ప్రజా సంఘ నాయకులు ఆరోపించారు. బంగారుపాళ్యంలో మాజీ సీఎం జగన్ పర్యటనలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై దాడిని ఖండిస్తూ గురువారం పుంగనూరులో ప్రజా సంఘాలతో కలిసి ఏపీడబ్ల్యూజేఎఫ్ సంఘ నాయకులు స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దారుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సలీం, ఏపీ అబ్దుల్‌కలాం ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ అయూబ్‌ఖాన్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు, ఎమ్మార్పీఎస్ నాయకులు నరసింహులు, జర్నలిస్టులు గిరిశేఖర్ సైపుల్లా, అప్పా, లోకేశ్, మురళి, ఏబీఎన్ మురళి, కార్తీక్, పురుషోత్తం, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

● **చౌడేపల్లె:** ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ నాయకులు దాడి చేయడం దారుణమని బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు కడియాల మనోహర్ పేర్కొన్నారు. విలేకర్లపై దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రవీణ్, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

● **పెద్దపంజాణి:** ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై దాడి చేసిన వారిని గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని పెద్దపంజాణి పీపీఎస్ అధ్యక్షులు శ్రీరాములు గురువారం ఓ ప్రకటనలో డిమాండు చేశారు. దాడికి పాల్పడిన, రెచ్చగొట్టిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

● **సోమల:** బంగారుపాళ్యంలో ఆంధ్రజ్యోతి సీనియర్ ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సోమల తహసీల్దార్ కార్యాలయంలో డీటీ మధుసూదన్‌కు గురువారం ప్రజా సంఘాల నాయకులు, సోమల రిపోర్టర్లు వినతి పత్రం అందజేశారు.

తల్లిదండ్రుల బాధ్యత మరింత పెరగాలి

● ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్


సంతపేట స్కూల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సెంట్రల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): పిల్లలపై టీచర్లతో పాటు తల్లిదండ్రుల బాధ్యత మరింత పెరగాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సూచించారు. స్థానిక సంతపేటలోని పీఎన్సీ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పీటీఎం 2.0లో నగర మేయర్ అముద, మాజీ ఎమ్మెల్యే దొరబాబులతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాతలను సన్మానించారు. పిల్లలు వారి తల్లిదండ్రులకు పాదాభివందనం చేశారు. తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్ డీవైఈవో ఇందిర, ఎంఈవో 1, 2 సెల్వరాజ్, మోహన్, హెచ్‌ఎం భారతి, టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ● స్థానిక పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డీఐఈవో దయానందరాజు అధ్యక్షతన మెగా పీటీఎం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న విశ్రాంత జిల్లా జడ్జి, లోక్ అదాలత్ జడ్జి రమేష్‌బాబు, పూర్వ విద్యార్థి, వేమూ కళాశాల కరస్పాండెంట్ చంద్రశేఖర్ నాయుడు విద్యార్థుల తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జూనియర్, ఒకేషనల్ కళాశాలల ప్రిన్సిపాల్ అబ్దుల్ మజీద్, మహేష్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ● స్థానిక విజయం స్కూల్లో డైరెక్టర్ శైలజామూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విశ్రాంత ఎంఈవో కృష్ణమనాయుడు, విశ్రాంత సీఈబీ చైర్మన్ వీరరాఘవులు ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు పలుసూచనలు చేశారు. ● చిత్తూరు హార్వర్డ్ స్కూల్లో కరస్పాండెంట్ భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ● స్థానిక బృందావన్ పాఠశాలలో కరస్పాండెంట్ శైలజాకుమారి, డైరెక్టర్ ప్రియతేజ అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ నిత్యబాబు ముఖ్య అతిథిగా పాల్గొని పలు సూచనలు చేశారు.

ఫొటోగ్రాఫర్‌పై దాడికి పాల్పడిన వారిపై చర్యలు

- ప్రభుత్వ విప్ థామస్


థామస్‌ను కలిసిన జర్నలిస్టులు

వెదురుకుప్పం, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి చిత్తూరు స్టాఫ్ ఫొటో గ్రాఫర్ శివకుమార్‌పై బంగారుపాళ్యంలో మాజీ సీఎం జగన్ పర్యటన సందర్భంగా దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన కఠినచర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్, జీడీనెల్లూరు ఎమ్మెల్యే థామస్ అన్నారు. గురువారం జీడీనెల్లూరు నియోజకవర్గ పర్యటనలో ఉన్న థామస్‌ను కొత్తపల్లిమిట్టలో జర్నలిస్టులు కలసి ఫొటోగ్రాఫర్‌పై జరిగిన ఘటనపై విన్నవించారు. థామస్‌ను కలసిన వారిలో పన్నూరు రవి, తిరుమల, వెంకటేశులు, సతీష్, మహేంద్ర తదితరులు ఉన్నారు.

● నగరి (ఆంధ్రజ్యోతి): ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై దాడి చేయడం పట్ల నగరి ప్రెస్‌క్లబ్ సభ్యులు, అఖిలపక్ష నాయకులు నిరసన తెలిపారు. నగరి ఆర్డీవో కార్యాలయ సూపరింటెండెంట్ శివరామన్‌కు గురువారం విలేకరులు వినతి


వినతిపత్రం అందిస్తున్న నగరి విలేకరులు

పత్రం అందించారు. సాయంత్రం నాలుగు గంటలకు టీడీపీ, బీజేపీ, సీపీఐ నాయకులు శివకుమార్‌పై దాడిని ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నగరి పట్టణ అధ్యక్షుడు రమేష్‌బాబు, నేతలు బాలాజీ, కృష్ణారెడ్డి, జ్యోతి నాయుడు, ఎం.వి.శ్రీనివాసులు, వరదరాజులు, గుణశేఖర్, ఐ.వి.నాయుడు, శ్రీధర్, అలెక్స్, రాజా, కన్నయ్య, రవి, బీజేపీ నేత రామ్మూర్తియాదవ్, సీపీఐ నాయకులు వేలన్, బాషా తదితరులు పాల్గొన్నారు.

● పూతలపట్టు (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు నియోజకవర్గ విలేకరులు శివకుమార్‌పై దాడిని ఖండిస్తూ గురువారం అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. జి.మణి, రమణ, గురునాథ్, వాసుదేవ ఆచారి, మంజునాథ్, జయచంద్ర, రవీంద్ర, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.


పూతలపట్టులో నిరసన తెలుపుతున్న విలేకరులు

● గంగాధరనెల్లూరు (ఆంధ్రజ్యోతి): ఏపీయుడబ్ల్యుజే ఆధ్వర్యంలో గంగాధరనెల్లూరు మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద విలేకరులు నిరసన తెలిపారు. పన్నూరు రవి, కలవకుంట రమేష్, దాసరి వెంకటేష్, జయప్రకాష్, తిరుమల, ఎం.జి.ఆర్, సతీష్ పాల్గొన్నారు.



గంగాధరనెల్లూరులో..

ఎమ్మెల్యేని కలిసిన సింగిల్ విండో చైర్మన్లు


ఎమ్మెల్యే భానును కలిసిన సింగిల్‌విండో చైర్మన్లు

విజయపురం, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలో నూతనంగా ఎన్నికైన కోసలనగరం సింగిల్ విండో అధ్యక్షుడు బాబుయాదవ్, అగరం రామకృష్ణా సింగిల్‌విండో అధ్యక్షుడు బాబు నాయుడు గురువారం నగరి ఎమ్మెల్యే భాను ప్రకాష్‌ను తిరుపతిలోని ఆయన స్వగృహంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. తమ సేవలను గుర్తించి సింగిల్ విండో అధ్యక్షులుగా ఎంపిక చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి చినబాబును కలిశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలసుబ్రహ్మణ్యంరాజు, రమేష్‌రాజు, దశరథరాజు, శివయ్యనాయుడు, సుధానాయుడు, గాలి రమేష్, మధునాయుడు, చంద్రబాబు, బాబు, సింగిల్‌విండో డైరెక్టరు వరదరాజులు తదితరులు పాల్గొన్నారు.

గోడ కూలి మహిళ మృతి



పూతలపట్టు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఇంటి గోడ కూలి ఓ మహిళ మృతిచెందిన సంఘటన మండలంలోని బందార్లపల్లెలో జరిగింది. వావిల్‌తోట పంచాయతీ మూర్తిగానివూరు గ్రామానికిచెందిన మల్లిక(35) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈమె యథావిధిగా గురువారం బందార్లపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు ఇంటిలో కూలీ పని చేస్తుండగా మొదటి అంతస్థులో గోడ కూలి ఆమెపై పడింది. దీంతో మల్లిక అక్కడికక్కడే మృతిచెందింది. ఈ మేరకు సీఐ కృష్ణమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతుసేవా కేంద్రాల్లో జాబితా

నగరి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రైతుసేవా కేంద్రాల్లో అన్నదాత సుఖీభవ లబ్ధిదారుల జాబితా అందుబాటులో ఉందని నగరి వ్యవసాయ సంచాలకులు సౌభాగ్యలక్ష్మి తెలిపారు. రైతులు ఎవరైనా అర్హులుగా వుండి జాబితాలో పేరు లేకుంటే రైతు సేవా కేంద్రం సిబ్బందిచే గ్రీవెన్స్ వెబ్‌సైట్‌లో జూలై 13వ తేదీలోగా నమోదు చేసుకోవాలని నగరి, నిండ్ర, విజయపురం, ఎస్ఆర్ పురం, జీడీనెల్లూరు, పాలసముద్రం మండలాల రైతులకు తెలిపారు. ఆధార్ అనుసంధానం కాకపోవడం వంటి అంశాలున్న రైతులు తహశీల్దార్‌ను కలిసి వెబ్‌ల్యాండ్‌లో సరిచేసుకోవాలని సూచించారు.

విద్యార్థుల సమగ్రాభివృద్ధి

ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమన్వయంతో

● ఎంపీ దగ్గుమళ్ల, ఎమ్మెల్యే మురళీమోహన్



బంగారుపాళ్యంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్, 49. కొత్తపల్లెమిట్టలో ప్రభుత్వ విప్ థామస్‌కు మొక్కలు ఇస్తున్న టీడీపీ నేతలు

బంగారుపాళ్యం, జూలై 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమన్వయం ఎంతో అవసరమని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. గురువారం మండలంలోని కీరమంద ఎంపీపీ పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశానికి వారు హాజరయ్యారు. అనంతరం బంగారుపాళ్యం ప్రభుత్వ పాఠశాలలో పాల్గొన్న వారు మాట్లాడుతూ విద్యార్థులకు అమలవుతున్న మధ్యాహ్నభోజన పథకం, విద్యా కిట్లు, విద్యార్థి విద్యా సామర్థ్యంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడానికి ఈ సమావేశాలు ఎంతో దోహదం చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్పీ ధరణీప్రసాద్, నేతలు ఎన్పీ జయప్రకాష్, కోదండయాదవ్, జనార్థన్‌గౌడ్, సర్పంచ్ ఉమాదేవి, తహశీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్, ఎంఈవో నాగేశ్వర్‌రావు, హెచ్‌ఎం రాజేంద్ర, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి: థామస్

శ్రీరంగరాజపురం (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండలం 49. కొత్తపల్లెమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తన సొంత నిధులతో అభివృద్ధి చేస్తానని గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్ అన్నారు. ఈ పాఠశాలలో జరిగిన పేరెంట్స్ టీచర్స్ సమావేశానికి ఆయన హాజరై, నూతన కాంపౌండ్ వాల్, ల్యాబ్‌ను, ఎస్ఆర్ పురం మండలం పుల్లూరు రోడ్డు నుంచి పాలసముద్రం మండల ఆముదల వరకు బెంగళూరు బస్సు సర్వీసును ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, డీఈవో వరలక్ష్మి, ఎస్ఎస్ఏపీసీ వెంకటరమణ, ప్రత్యేకాధికారి చంద్రశేఖర్, తహసీల్దార్ లోకనాథం పిళ్లై, ఎంపీడీవో మోహనమురళి, ఎంఈవోలు అరుణాచలంరెడ్డి, సబర్మతి, హెచ్‌ఎం శాంతి, నాయకులు సూరిరెడ్డి, సతీష్, సాంబశివ, యోగి నాయుడు, క్రిష్ణమ్మ నాయుడు, జీవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● గుడిపాల (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష పార్టీ ఎన్ని అడ్డంకులు సృష్టించిన ప్రజల కోసం సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. మండలంలోని బొమ్మసముద్రం జడ్పీ హైస్కూల్‌లో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు తన సొంత నిధులతో క్రికెట్ కిట్ అందించారు. ఎంపీడీవో శిరీష, ఎంఈవో గణపతి, మాజీ జడ్పీటీసీ బాలాజీనాయుడు, మాజీ ఎంపీపీ నాగరాజ్‌యాదవ్, హెచ్‌ఎం దుర్వాసులు, సర్పంచ్ రజనీకాంత్, ఎంపీటీసీ విజయలక్ష్మి, విద్యాకమిటీ చైర్‌పర్సన్ డిల్లీ బాయి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అన్నం వడ్డిస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

● యాదమరి (ఆంధ్రజ్యోతి): యాదమరి మండలంలోని కోణాపల్లి పాఠశాలలో జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా జేసీ విద్యాధరి హాజరై పలు సూచనలు చేశారు. దాసరాపల్లి పాఠశాలకు ధరణి ప్రకాష్ భార్య మాధవి జ్ఞాపకార్థం రూ.10వేలు విలువ చేసే నోటు పుస్తకాలు వితరణ చేశారు. కాశిరాళ్ళ, యాదమరితో పాటు మండలంలోని అన్ని పాఠశాలల్లో పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ పార్థసారథి, ఎస్ఐ ఈశ్వర్, ఎంఈవోలు రుక్మిణి, ప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రబీ, నాయకులు హేమగిరి, వల్లేరు అమరనాథ నాయుడు, పాఠశాల కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జేసీ విద్యాధరి



తుమ్మింద జడ్పీ పాఠశాలలో విద్యార్థుల నాటక ప్రదర్శన

● చిత్తూరు రూరల్ (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని తుమ్మింద జడ్పీ పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన నాటకం అలరించింది. మెప్మా పీడీ రవీంద్ర, హెచ్‌ఎం సంజీవి, జేవీవీ నాయకులు అరుణ శివప్రసాద్, తల్లిదండ్రులు పాల్గొన్నారు. బీఎన్ఆర్ పేట జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ పెద్దలు మనోహర్ నాయుడు, శ్రీనివాసులు, నాగభూషణంలను కళాశాల అధ్యాపకులు ఘనంగా సత్కరించారు.

● నిండ్ర (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో తల్లిదండ్రులకు విద్యార్థుల పాదాభివందనాలు, మొక్కల పెంపకం, మధ్యాహ్నం సహపంక్తి భోజనం నిర్వహించారు. నిండ్రలో సింగిల్‌విండో అధ్యక్షులు వెంకటేశ్వరరావు, ఎంఈవో శ్రీధర్‌రాజు, నాయకులు బాబుయాదవ్, జగన్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● ఐరాల (ఆంధ్రజ్యోతి): మండలంలోని మట్టపల్లె ఎంపీపీ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఈడీ ఫైనాన్స్ కార్పొరేషన్ హరినాథరెడ్డి, సర్పంచ్ మునిరత్నం, విద్యాకమిటీ చైర్మన్ అమర్నాథ్, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● పాలసముద్రం (ఆంధ్రజ్యోతి): బలిజకండ్రిగ జడ్పీ హైస్కూల్‌లో పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులకు జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వాసు నాయుడు రూ.20 వేలు నగదు బహుమతిని అందజేశారు. వనదుర్గాపురం ప్రాథమిక పాఠశాలలో పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు పి.దేవయ్య, ఎన్.వెంకట్రాజు, శ్రీరాములునాయుడును ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు సన్మానించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, తహసీల్దార్ అరుణకుమారి, ఎంపీడీవో సతీష్, ఎంఈవో రాజేంద్రప్రసాద్, ఎంఈవో-2 గిరిజ తదితరులు పాల్గొన్నారు.

● పూతలపట్టు (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు ఉన్నత పాఠశాలతో పాటు మండలంలోని పలు పాఠశాలల్లో పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ జరిగింది. ఈ కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్ విక్రమ్‌కుమార్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు మధుసూదన్, విశ్రాంత ఎంఈవో సుబ్రహ్మణ్యం, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్, సత్యనారాయణ, ఎంపీడీవో నాగరాజు, తహసీల్దార్ రమేష్ బాబు, పూతలపట్టు ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్ నేతాజీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● నగరి (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీలోని చింతలపట్టెడలో గల వినాయకపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తహశీల్దార్ రవికుమార్, ఎంఈఓలు శ్రీదేవి, నమశ్శివాయ, పీసీఎన్ ఉన్నత పాఠశాలలో కమిషనర్ కృష్ణారెడ్డి, పీసీఎన్ జూనియర్ కళాశాలలో డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్‌లు పాల్గొన్నారు. నగరి బాలికల ఉన్నతపాఠశాల, బుగ్గ


చింతలపట్టెడలోని వినాయకపురం ఉన్నత పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు

కండ్రిగ పాఠశాలల్లో ఈ వేడుకలను జరుపుకున్నారు.

● పెనుమూరు (ఆంధ్రజ్యోతి): పెనుమూరు, ఉగ్రాణంపల్లి పాఠశాలల్లో జరిగిన కార్య క్రమాల్లో ఆర్డీవో శ్రీనివాసులు పాల్గొని ప్రసంగించారు. ఈ పాఠశాలల్లో లైబ్రరీ పుస్తకాల కొనుగోలుకు రూ.10వేలు చొప్పున అందించారు. ఉగ్రాణంపల్లి పాఠశాలలో టీడీపీ చిత్తూరు పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కార్జాల అరుణ ప్యూరిఫైడ్ వాటర్‌కోసం రూ.30వేలు హెచ్‌ఎంలకు అందించారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రావణ్‌కుమార్, మండల అధ్యక్షులు రుద్రయ్య నాయుడు, తలారి రెడ్డెప్ప, పరమేశ్వరరెడ్డి, ఎంఈవో భాస్కర్ నాయుడు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.



వేపంజేరి హైస్కూల్లో విద్యార్థిని తల్లికి బహుమతి అందజేస్తున్న జేడీ మురళీక్రిష్ణ, ఎంపీడీవో కృష్ణమహేష్‌రెడ్డి

● వెదురుకుప్పం (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో, చవటగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, దేవళంపేట సోక్రటీస్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం పండుగ వాతావరణలో జరిగింది. మండల స్థాయి అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ● కార్వేటినగరం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఈ సమావేశాలను నిర్వహించారు. డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో తల్లికి వందనం అంటూ ఏర్పాటు చేసిన లోగో ఆకట్టుకుంది. ఉపాధ్యాయులు కూడా అమ్మకు ఒక మొక్క అంటూ చేతపట్టుకున్నారు.

● గంగాధరనెల్లూరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెల్లేపల్లె హైస్కూల్లో డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, వేపంజేరి హైస్కూల్లో జిల్లా వ్యవసాయశాఖ జేడీ మురళీకృష్ణ, ఎంపీడీవో కృష్ణమహేష్‌రెడ్డి, మేనాటంపల్లె (సిద్దేశ్వరకొండ) హైస్కూల్లో తహసీల్దార్ శ్రీనివాసులు, కాళేపల్లె హైస్కూల్లో ఎంఈవో గుణశేఖర్‌రెడ్డిలు పాల్గొన్నారు. గంగాధరనెల్లూరు హైస్కూల్లో కార్యక్రమాన్ని డీఈవో వరలక్ష్మి తనిఖీచేశారు.

● విజయపురం (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం పాఠశాలలో ఎంపీడీవో రాజేంద్ర, మహారాజపురం పాఠశాలలో ఎంఈవో హరిప్రసాద్‌వర్మ, విజయపురం పాఠశాలలో చిత్తూరు పార్లమెంటు టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, రాష్ట్ర టీడీపీ బీసీ అధికార ప్రతినిధి చుక్కా ధనుంజయయాదవ్, పలువురు ప్రతినిధులు పాల్గొని ప్రభుత్వ ఆశయాలను వివరించారు. విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు, తల్లిదండ్రులకు ముగ్గులు, ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్‌లు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

● తవణంపల్లె (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం తవణంపల్లె ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశానికి ప్రత్యేకాధికారి బాలాజి హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న వివిధ వసతులను విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఎంఈవో హేమలత, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో మొక్కలు చూపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

సుపరిపాలనతోనే పల్లె ప్రాంతాలు ప్రశాంతం

● ఎంపీ దగ్గుమళ్ల, ఎమ్మెల్యే థామస్


ఎంపీ, ఎమ్మెల్యేను గజమాలతో సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

శ్రీరంగరాజపురం, జూలై 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ సుపరిపాలనతో పల్లె ప్రాంతాలు ప్రశాంతంగా ఉన్నాయని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, జీడీ నెల్లూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ థామస్ అన్నారు. గురువారం కట్టికపల్లెలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పాలనా దక్షతను ప్రజలు మెచ్చుకుంటున్నారని తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, మాజీ సర్పంచ్‌లు దీప, వరదరాజులు, బాబు నాయుడు, నాయకులు గంధమనేని రాజశేఖర్ నాయుడు, ఎల్.బాబు నాయుడు, సూరిరెడ్డి, శేఖర్, రవి, వేమ నాయుడు, పైనేని మురళి, ఎన్.కుమార్, శ్రీధర్ యాదవ్, కృష్ణమ నాయుడు, రుద్రయ్య నాయుడు, రుద్రప్ప నాయుడు, త్యాగరాజులు నాయుడు, బాలాజీ నాయుడు, నిరంజన్‌రెడ్డి, కిషన్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి

బంగారుపాళ్యం, జూలై 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి చెందుతుందని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. బంగారుపాళ్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంచిపెడుతూ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్పీ ధరణీప్రసాద్, కోదండయాదవ్, జనార్థన్‌గౌడ్, రమేష్, నాసిర్ ఖాన్, హరిప్రసాద్, ఆరీఫ్, రమేష్, రాధిక, దేవయాని పాల్గొన్నారు.

'చట్ట ప్రకారమే భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్నా'

చిత్తూరు సిటీ, జూలై 10(ఆంధ్రజ్యోతి): చట్ట ప్రకారమే తాను భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్నానని గుడిపాల మండలం బుచ్చన్న గ్రామానికి చెందిన మొగిలి నాయుడు చెప్పారు. గురువారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ తప్పుడు పత్రాలతో భూమిని రిజిస్ట్రేషన్ చేశానని మునీంద్ర నాయుడు చేసిన ఆరోపణలు అవాస్తవమని చెప్పారు. చట్ట ప్రకారం తన తండ్రి సోదరులకు నగదు చెల్లించి వారి భూమిని తాను రిజిస్ట్రేషన్ చేసుకున్నానని తెలిపారు. ఇంటిస్థలంతో పాటు దారిని కూడా ఆక్రమించానని మునీంద్రనాయుడు నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. తన పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారని జీర్ణించుకోలేక మునీంద్రనాయుడు తనపై ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. మొగిలినాయుడు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

కల్తీ కల్లు విక్రయించిన వ్యక్తి అరెస్టు

పాలసముద్రం, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసింహాపురంలో లక్ష్మణమూర్తి కల్లును కల్తీ చేసి విక్రయిస్తున్నట్లు కార్వేటినగరం సీఐ శిరీషాదేవికి మద్యం ప్రియులు ఫిర్యాదు చేశారు. దీంతో మూడు రోజుల క్రితం సీఐ కల్లు దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, శ్యాంపిల్ సేకరించారు. కల్లులో కల్తీ జరిగినట్లు తేలడంతో గురువారం లక్ష్మణమూర్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: ఎమ్మెల్యే గురజాల

చిత్తూరు సిటీ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభి వృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం ఎమ్మెల్యే సాంబయ్య కండ్రిగ - కట్టమంచి బీటీ రోడ్డుకు, నగరంలోని రోడ్ల విస్తరణలో భాగంగా బాస్కరా హోటల్ వద్ద రోడ్డు విస్తరణ పనులకు, కొత్త బస్టాండు వద్దఉన్న పుట్‌పాత్ గ్రీనరీ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం 46వ డివిజన్ పాంచాలి పురం, 49వ డివిజన్ తిమ్మసముద్రం, 48వ డివిజన్ సంతపేట రాగిమాను రచ్చబండ, 45వ డివిజన్‌లలో పర్యటించారు. 47వ డివిజన్ ఇన్‌చార్జ్ ఉదయ్‌కుమార్ లెనిన్‌నగర్, బీడీ కాలనీలోని నలుగురు విద్యార్థులకు రూ.25 వేల విలువ చేసే సైకిళ్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ మోహన్ రెడ్డి, నేతలు వెంకటేష్ యాదవ్, రాజశేఖర్, సురేష్, సురేష్ నాయుడు, సీఎం విజయ, రతీదేవి ఈశ్వర్, దిలీప్, యుగంధర్, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.


గ్రావెల్ లారీలను అడ్డుకున్న మహారాజపురం వాసులు

విజయపురం, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహారాజపురంలో గ్రావెల్ లారీలను గురువారం గ్రామస్తులు అడ్డుకున్నారు. సరైన బిల్లులు లేకుండా గ్రావెల్ తరలిస్తున్నారని, రాత్రి సమయాల్లో కూడా ఇష్టానుసారంగా తరలిస్తున్నారని, రోడ్డుకు సమీపంలో నివాసంఉన్న వారికి శబ్దంతో నిద్రకు భంగం కలుగుతున్నదని వాపోతున్నారు. హైవేరోడ్డు నిర్మాణానికి అనుమతులు తీసుకొని తమిళనాడులో ప్రైవేటువారితో వ్యాపారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. క్వారీ యజమానులను ప్రశ్నిస్తే దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయమై అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పీఏసీఎస్ అభివృద్ధికి కృషిచేయండి

నిండ్ర, జూలై 10(ఆంధ్రజ్యోతి): నూతనంగా నియమింపబడిన త్రిసభ్య కమిటీ పీఏసీఎస్ అభివృద్ధికి కృషి చేయాలని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. గురువారం ఎమ్మెల్యే నివాసంలో ఎంపికైన త్రిసభ్య కమిటీ చైర్మన్ వెంకటేశ్వరరావు, డైరక్టర్లు పెరుమాల్‌రెడ్డి, శివలింగంతో పాటు నాయకులు ఆయన్ను కలిసి ఘనంగా సత్కరించారు. నాయకులు రవినాయుడు, బాబుయాదవ్, జగన్, రవి రాజు, ఓం ప్రకాష్, రఘురాం, మహేష్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తవణంపల్లె టీడీపీ అధ్యక్షుడిగా వెంకటేష్



తవణంపల్లె, జూలై 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ తవణంపల్లె మండల అధ్యక్షుడిగా మండలంలోని జి.గొల్లపల్లెకు చెందిన గుర్రం వెంకటేష్ చౌదరిని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. గురువారం చిత్తూరులోని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వెంకటేష్ చౌదరిని మండల టీడీపీ అధ్యక్షుడు గాలి దిలీప్ ప్రతిపాదించగా, పార్టీ పరిశీలకులు బొమ్మన శ్రీధర్, ఎన్నికల పరిశీలకురాలు కుమారి, మండల పార్టీ నాయకుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. కార్యక్రమంలో బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌నాయుడు, నాయకులు మోహన్‌నాయుడు, రెడ్డప్ప, మనోహర్‌నాయుడు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గురుపౌర్ణమి పూజలు

చిత్తూరు కల్చరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని కట్టమంచి షిరిడీ విశ్వసాయిబాబా ఆలయంలో ఆలయ ట్రస్టీ సీకే బాబు దంపతుల ఆధ్వర్యంలో గురుపౌర్ణమి సందర్భంగా కాకడ హారతి, పంచామృతాభిషేకం, అర్చన, సంధ్య, శేజ హారతులు, సత్యనారాయణ వ్రతం, అన్నదానం నిర్వహించారు. కుమ్మరవీధి, జీకే నగర్, గిరింపేట మసీదు మిట్ట, కొంగారెడ్డిపల్లె, దొడ్డిపల్లె తదితర ప్రాంతాల్లోని సాయిబాబా ఆలయాల్లో పూజలు జరిగాయి. ● గిరింపేట చెంగల్ రాయకొండ వల్లీ దేవసేనసమేత సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. మూలవర్లను ప్రత్యేక పూలరథంపై అధిష్ఠింపజేసి సీబీ రోడ్, దర్గా, ఎంఎస్ఆర్, జడ్పీ, గిరింపేట, చౌడేశ్వరమ్మ సర్కిల్ తదితర ప్రాంతాల్లో గిరిప్రదక్షిణ నిర్వహించారు. గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో సత్యసాయి బాబాకు భక్తులు పల్లకి సేవ నిర్వహించారు. ఈవో సుబ్బారెడ్డి, పాల సుబ్రమణ్యం, యస్.మధుసూదనం తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖరపురం సింగిల్ విండో చైర్మన్‌గా హేమచంద్ర నాయుడు


హేమచంద్రనాయుడు, హరిప్రసాద్

బంగారుపాళ్యం, జూలై 10(ఆంధ్రజ్యోతి): చంద్రశేఖరపురం సింగిల్ విండో చైర్మన్‌గా హేమచంద్ర నాయుడును ప్రభుత్వం ప్రకటించింది. సభ్యులుగా కాటప్పగారిపల్లెకి చెందిన దేవయాని, ఈచనేరి పల్లెకి చెందిన హరిప్రసాద్‌లను సభ్యులుగా ఎంపిక చేశారని చైర్మన్ హేమచంద్ర నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఎమ్మెల్యే మురళీమోహన్, మండల టీడీపీ అధ్యక్షుడు ధరణీప్రసాద్‌కు ఆయనకృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా ప్రాకారోత్సవం


సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహిస్తున్న భక్తులు

ఐరాల(కాణిపాకం), జూలై 10(ఆంధ్రజ్యోతి): కాణిపాకంలో వెలసిన వరదరాజస్వామి ఆలయంలో గురు పౌర్ణమిని పురస్కరించుకుని ప్రాకారోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం వరదరాజస్వామి మూల విరాట్‌కు ఘనంగా అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల ఆధ్వర్యంలో సత్యనారాయణ స్వామి పూజ, వ్రతాన్ని నిర్వహింపచేశారు. ఈవో పెంచలకిషోర్, ఏఈవో రవీంద్రబాబు, ధనపాల్, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు తదితరులు పాల్గొన్నారు.

వ్యాస మహర్షికి ప్రత్యేక పూజలు

ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో గురువారం ఆషాడ పౌర్ణమి(వ్యాస పౌర్ణమి)ని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. దేవాదాయశాఖ సూచనలమేరకు ప్రధాన ఆలయంలోని కల్యాణ వేదిక వద్ద వ్యాస మహర్షి చిత్రపటాన్ని ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం

● గరుడుడిపై దర్శనమిచ్చిన కోదండరాముడు


సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

తవణంపల్లె, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.పుత్తూరు కోదండరామాలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి కల్యాణోత్సవాన్ని, గరుడసేవను వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలతో పాటు ఉంజల్‌సేవ నిర్వహించి, మేళతాళాల నడుమ టి.పుత్తూరు పురవీధుల్లో గరుడ వాహనంపై ఊరేగించారు. ఆలయ ధర్మకర్త సిద్దేశ్వర్‌రెడ్డి, ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.